మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 12-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 103 Issue: 103

12 అక్టోబర్ 2025 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:12 సూర్యాస్తమయం - సా. 5:52 తిథిః షష్ఠి మ. 2:21 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మృగశిర మ. 1:38 వరకు తరువాత ఆరుద్ర యోగం వరియ ఉ. 10:52 వరకు కరణం వనిజ మ. 2:21 వరకు విష్టి రా. 1:19 వరకు వర్జ్యం రా. 9:36 నుండి రా. 11:07 వరకు దుర్ముహూర్తం సా. 4:19 నుండి సా. 5:06 వరకు రాహుకాలం సా. 4:25 నుండి సా. 5:52 వరకు యమగండం మ. 12:02 నుండి మ. 1:30 వరకు గుళికాకాలం మ. 2:57 నుండి సా. 4:25 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:36 నుండి తె. 5:24 వరకు అమృత ఘడియలు తె. 5:25 నుండి ఉ. 6:54 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:39 నుండి మ. 12:25 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# హైదరాబాద్ ఐకానిక్.. టీ స్క్వేర్



## డిజైన్లు ప్రత్యేకంగా ఉండాలి.. హైదరాబాద్‌కు బ్రాండ్‌లా ఉండాలి

## ఏఐ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేద్దాం.. సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలకు కేంద్రమైన రాయదుర్గం ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయంగా టీ-స్క్వేర్ నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం రోజున కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఏఐ హబ్, టీ-స్క్వేర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన టీ-స్క్వేర్ ప్రాజెక్టుపై పలు సూచనలు చేశారు.



హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): ప్రతిపాదిత టి-స్క్వేర్ కోసం శక్తివంతమైన, ప్రత్యేకమైన డిజైన్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇది హైదరాబాద్‌కు ఒక ఐకానిక్ నిర్మాణంగా, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా ఉండాలని చెప్పారు. టీ-స్క్వేర్ పనులు నవంబర్ చివరి నాటికి ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. టీ-స్క్వేర్ నగరంలోనే ఒక ఐకానిక్ భవనంలా ఉండాలని, అందుకు అనుగుణంగా డిజైన్, నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. టీ-స్క్వేర్ డిజైన్ తరువాయి 2 వ పేజీలో...



## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకు సర్కారు!

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను, ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతినివ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరనుంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనుంది. జీవో 9ను అమలు తరువాయి 2 వ పేజీలో...

## 16న కేబినెట్ భేటీ

### ఎన్నికలు సహా పలు అంశాలపై చర్చ!

రాష్ట్ర మంత్రిమండలి ఈనెల 16న సమావేశం కానుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని గతంలో కేబినెట్ నిర్ణయించింది. అయితే వరదలు, బీసీ రిజర్వేషన్ల హడావిడి తదితర కారణాలతో కొంతకాలంగా ఈ సమావేశాలు జరగలేదు. కాగా ఈనెల 16న కేబినెట్ సమావేశం జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. 2




## ఈ నెల 14న రాష్ట్ర బంద్

### ఆర్ కృష్ణయ్య పిలుపు



హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

పెద్దపల్లి ప్రజలకు కేంద్రం శుభవార్త చెప్పింది. రామగుండం ఎయిర్‌పోర్టు కల నిజం దిశగా ముందడుగు పడింది. ఈ ఎయిర్‌పోర్టు కోసం రూ.40.53 లక్షలు మంజూరు చేసి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఫ్రీ ఫీజిబిలిటీ స్టడీ ఫీజు చెల్లించింది. ఈ విషయాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఇది రామగుండం ఎయిర్‌పోర్టు స్థాపనకు చారిత్రక ముందడుగు అని అభిప్రాయపడ్డారు.



2

## ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి

### అవకాశాలు సృష్టించుకోండి.. సామర్థ్యాన్ని గుర్తించండి.. కలలు కనండి

### జెన్ జీకి కేటీఆర్ పిలుపు.. కోయంబత్తూర్‌లో ఎఫ్ఎంఏఈకి హాజరు

ఉద్యోగులు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా నేటి యువత ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ - నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ 2025కి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా మీరే సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు.

## వాణిజ్య సాగు పెంచండి

### దిగుమతులపై ఆధారపడొద్దు.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికంగా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.



న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన దేశంలో పండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే, తమ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని ఆయన తెలిపారు. భారత్ అభివృద్ధి చెందిన తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,508 |
| వెండి (గ్రాము): | రూ.190 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,542 |

## విశ్వవాణి



### కుక్కలకూ ప్రాబ్లమ్స్!

మనుషుల లాగే కుక్కలకు కూడా చాలా సమస్యలు ఉంటాయట. అవి కూడా మనలాగే ఆ సమస్యలపై రాత్రంతా మేల్కొని ఆలోచిస్తాయట. నిద్రకు ముందు అవి తమలోని నెగటివ్ ఎమోషన్స్ గురించి ఆలోచిస్తూ నిద్ర పోకుండా ఉంటాయని రాయల్ సొసైటీ ఓపెన్ సైన్స్ జర్నల్‌లో ఓ అధ్యయనం ప్రచురితమైంది.



## పొంగులేటి పెత్తనమేంది?

### నా శాఖలో ఆయన జోక్యమేంది?


### మంత్రి కొండా సురేఖ ఫైర్

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ప్రతిష్ఠాత్మక మేడారం ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ మధ్య వివాదం తలెత్తింది. ఈ వ్యవహారంలో మంత్రి పొంగులేటి తన శాఖలో జోక్యం చేసుకుంటున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): వివరాల్లోకి వెళితే, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సుమారు రూ.71 కోట్ల విలువైన మేడారం అభివృద్ధి పనుల టెండర్‌ను తన అనుచరుడికి కట్టబెట్టేందుకు పొంగులేటి ప్రయత్నిస్తున్నారని కొండా సురేఖ ఆరోపించారు. తన శాఖ పరిధిలోని విషయాల్లో ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో పొంగులేటి జోక్యం చేసుకోవడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. ఈ అంశంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె, విషయాన్ని నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

**ఖర్గేకు కొండా మురళి ఫిర్యాదు**

వరంగల్ రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి మేడారం పనులను ఇప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు కూడా కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో అధిష్ఠానం



## వాట్సాప్ ఎందుకు? అరట్టై వాడండి

### సుప్రీం ధర్మాసనం సూచన

వాట్సాప్‌కు సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. కమ్యూనికేషన్ కోసం వాట్సాప్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని, దానికి బదులుగా దేశీయంగా అభివృద్ధి చేసిన 'అరట్టై' లాంటి యాప్‌లను ఉపయోగించుకోవాలని పిటిషనర్‌కు సూచించింది.

న్యూఢిల్లీ: 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. ఒక వ్యక్తి తన వాట్సాప్ ఖాతాను ఎలాంటి కారణం చెప్పకుండా బ్లాక్ చేశారని, దానిని పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ ఒక పాలీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారని, గత 10-12 ఏళ్లుగా

## చైనాపై ట్రంప్ 100% సుంకాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చైనాపై అదనంగా 100 శాతం సుంకాన్ని ప్రకటించారు. జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర సమావేశాన్ని రద్దు చేస్తామని హెచ్చరించారు. త్వరలో దక్షిణ కొరియా పర్యటనలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ కానున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది.

వాషింగ్టన్: అమెరికాకు ఖనిజాల ఎగుమతులపై చైనా పలు ఆంక్షలు విధించడంపై ట్రంప్ మండిపడ్డారు. ఇటువంటి సమయంలో జిన్‌పింగ్‌తో భేటీకి తగిన కారణం కనిపించడం లేదని పేర్కొన్నారు. దీనికి ప్రతిచర్యగా చైనా ఉత్పత్తులపై మళ్లీ భారీగా సుంకాలు తప్పవని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 'చైనాలో విచిత్రమైన విషయాలు చోటుచేసుకుంటున్నాయి. అరుదైన ఖనిజాలపై పలు ఆంక్షలు విధించాలనుకుంటున్నారు. దీనిపై ప్రపంచం మొత్తానికి లేఖలు పంపుతున్నారు. అందరికీ శత్రువులుగా మారుతున్నారు. చైనాతో తాము కొంతకాలంగా తాము మంచి సంబంధాలే తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు
12.10.2025

మేషం: బంధు వర్గం నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. వ్యాపారాలలో చిన్నపాటి సమస్యలు తప్పవు. ఉద్యోగాలలో ఆకస్మిక స్థానచలన సూచనలున్నవి. స్థిరస్థుల క్రయవిక్రయాలలో ఆటంకాలు కలుగుతాయి.

వృషభం: వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. సన్నిహితుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన ఉద్యోగ అవకాశములు లభిస్తాయి. ఉద్యోగాలలో అవాంతరాలు తొలగుతాయి. చేపట్టిన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ఇంటాబయ అనుకూల వాతావరణం ఉంటుంది.

మిధునం: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. సోదరులతో ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపార ఉ ద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. చేపట్టిన పనులు నిదానిస్తాయి.

కర్కాటకం: పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మీ ఆలోచనలు అందరికి నచ్చుతాయి. భూ క్రయ విక్రయాలు లాభిస్తాయి. వృత్తి వ్యాపారాలు ఉ త్సాహంగా సాగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. పాత సంఘటనలు జ్ఞప్తికి వస్తాయి.

సింహం: నూతనోత్సాహంతో కొన్ని వ్యవహారాలలో విజయం సాధిస్తారు. కీలక సమయంలో ఆప్తుల సలహాలు కలసి వస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మరింత లాభిస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులు నిరీక్షణ ఫలిస్తుంది.

కన్య: ఆర్థిక ఇబ్బందులు వలన నూతన రుణాలు చేసుకుంటారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ప్రయాణాలు వాయిదా పడుతాయి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమౌతాయి. బంధువులతో అకారణ విభేదాలు తప్పవు.

తుల: ఆర్థిక లావాదేవీలు కొంత నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉ ద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు.

వృశ్చికం: వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. పనులలో చికాకులు పెరుగుతాయి. ఉద్యోగాలలో మీహోదా పెరుగుతుంది. దీర్ఘ కాలిక రుణాలు తొలగుతాయి. దూరప్రయాణాలు వాయిదా పడుతాయి.

ధనస్సు: ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. వ్యాపార విస్తరణకు అవరోదాలు తొలగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతాయి.

మకరం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. నూతన రుణాలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో కొత్త సమస్యలు తప్పవు. ఆత్మీయులతో కొన్ని విషయాలలో విభేదాలు కలుగుతాయి. ప్రయాణాలలో ఊహించని మార్పులు ఉంటాయి.

కుంభం: ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలలో నూతన సమస్యలు కలుగుతాయి. నూతన రుణాలు చేస్తారు. దూరపు బంధువుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది.

మీనం: ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా సాగుతుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు మరింత విస్తరిస్తారు. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కలుగుతుంది. వ్యవహారాలు విజయవంతంగా సాగుతాయి. ఆప్తుల నుండి ఊహించని ఆహ్వానాలు అందితాయి.



# హైదరాబాద్ ఐకానిక్.. టీ స్క్వేర్

మొదటి పేజీ తరువాయి

పర్యాటకులను ఆకర్షించడం, రెస్టారెంట్లు, వ్యాపారం వంటి అంశాలు పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఆ ప్రాంతం 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునే లా ప్రదేశాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, రంగురంగుల డిజిటల్ ప్రకటనల ద్వారా ప్రపంచ స్థాయి డిజిటల్ డిస్‌ప్లే తో రూపొందించాలని చెప్పారు. యాపిల్ లాంటి ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు అక్కడ వ్యాపారం నిర్వహించేలా ఉండాలి. అలాగే పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాహనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు ఉండాలని తెలిపారు. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, వాణిజ్య కార్యకలాపాలతో పాటు కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా టీ–స్క్వేర్ రూపుదిద్దుకోవాలని సూచించారు. అలాగే హైదరాబాద్ లో ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏఐ ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, సెంటర్లను ఒకే చోట కలిపి ప్రపంచ ఏఐ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ హబ్‌లతో భాగస్వామ్యం చేసేందుకు ఈ హబ్ ఉపయోగపడాలని స్పష్టం చేశారు. 2024 నుంచి తెలంగాణను ఏఐకి ప్రముఖ ప్రపంచ గమ్యస్థానంగా ఉంచాలనే పెద్ద లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం అనేక ఇన్షియేటివ్స్ చేపట్టిందని తెలిపారు. 2024 సెప్టెంబర్‌లో గ్లోబల్ ఏఐ సమిట్ జరిగిందని, ఏఐ సిటీ ప్రాజెక్ట్ ప్లాన్ ప్రకటించబడిందని గుర్తుచేశారు. తెలంగాణ ఏఐ రైజింగ్ గ్రాండ్ ఛాలెంజ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.



# వాణిజ్య సాగు పెంచండి

మొదటి పేజీ తరువాయి

దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని మోదీ అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటినీ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు వేయించలేదని, అలాంటి ప్రాంతాలను తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందని అన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని, పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.

# పొంగులేటి పెత్తనమేంది?

మొదటి పేజీ తరువాయి

సానుకూలంగా స్పందించిందని అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న మేడారం జాతరను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే మేడారం టెండర్ల వ్యవహారంలో పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని కొండా దంపతులు ఆరోపిస్తున్నారు. ఇద్దరు మంత్రుల మధ్య టెండర్ల వివాదం తెరపైకి రావడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

# వాట్సాప్ ఎందుకు?అరట్టై వాడండి

మొదటి పేజీ తరువాయి

తన క్లయింట్‌లతో కమ్యూనికేట్ చేయడానికి వాట్సాప్‌నే వాడుతున్నారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, వాట్సాప్ యాక్సెస్ కలిగి ఉండటం ఆర్టికల్ 32 కింద ప్రాథమిక హక్కు ఎలా అవుతుందని ప్రశ్నించింది. "ఒకవేళ వాట్సాప్ లేకపోతే ఏంటి? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు అందుబాటులో ఉన్నాయి కదా! ఈ మధ్యే వచ్చిన స్వదేశీ యాప్ 'అరట్టై' ఉంది. దాన్ని వాడుకోండి. 'మేక్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించండి" అని ధర్మాసనం హితవు పలికింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైనది కాదని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు, దీనిపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. దీంతో, కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.

# చైనాపై ట్రంప్ 100% సుంకాలు

మొదటి పేజీ తరువాయి

కొనసాగించినప్పటికీ.. ఇటీవలి కాలంలో వారి చర్యలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. అందుకే దక్షిణ కొరియా పర్యటనలో జిన్‌పింగ్‌తో సమావేశం కావడానికి కారణాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే అమెరికా దిగుమతి చేసుకునే చైనా ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధించాలనుకుంటున్నాం' అంటూ అధ్యక్షుడు ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. బీజింగ్ అసాధారణ రీతిలో దూకుడుగా వ్యవహరించినందుకు ప్రతీకారంగా అదనపు సుంకాలు విధిస్తామన్నారు. వీటికి తోడు అదనంగా అమెరికా ఎగుమతి నియంత్రణలు నవంబర్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా– చైనా మధ్య ఉధృతంగా మారిన వాణిజ్య యుద్ధం తిరిగి రాజుకోవడంతో స్టాక్ మార్కెట్లు పడిపోయాయి. ఫెంటానిల్ వాణిజ్యంలో బీజింగ్ సహాయం చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. అనంతరం చైనా వస్తువులపై అదనపు సుంకాలు విధించారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో చైనాను సుంకాల హెచ్చింపుతో బెదిరించారు. ప్రపంచాన్ని తన బందీగా ఉంచడానికి చైనాను అనుమతించకూడదని ట్రంప్ రాశారు. చైనా వైఖరిని శత్రుత్వ ధోరణిగా అభివర్ణించారు.

## అమెరికా మార్కెట్లు క్రాష్

ట్రంప్ చైనాపై సుంకాల బాంబు పేల్చారు. బీజింగ్ దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే అమెరికా మార్కెట్లలో 1.5 ట్రిలియన్ డాలర్ల మేర మదుపర్ల సంపద ఆవిరైంది. మార్కెట్లు ముగిసే సమయానికి నాస్‌డాక్ 3.56 శాతం, డోజోన్స్ 1.90శాతం, ఎస్‌అండ్‌పీ 500 సూచీ 2.71శాతం మేర నష్టపోయాయి. అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్ భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన కొన్ని గంటలకే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం గమనార్హం. దీంతో రెండు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం నడుస్తుందనే భయాలు నెలకొన్నాయి. దాంతో అమెరికా మదుపర్ల సంపద 1.5 ట్రిలియన్ డాలర్ల మేర ఆవిరవగా.. క్రిప్టో మార్కెట్‌లో 19 బిలియన్ డాలర్ల మేర అమ్మకాలు చోటుచేసుకున్నాయి. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో అమ్మకాలు జరగలేదు. చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసినా ఈ సుంకం వర్తిస్తుంది. నవంబర్ ఒకటి లేదా అంతకంటే ముందే ఈ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయని ట్రంప్ హెచ్చరించారు. గతంలోనూ అమెరికా– చైనాల మధ్య వాణిజ్య యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ.. అది ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య మరోసారి వాణిజ్య ఉద్రిక్తతలు భగ్గమన్నాయి.



# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకు సర్కారు!

మొదటి పేజీ తరువాయి

చేసేలా ఆదేశాలు ఇవ్వాలని భారత అత్యున్నత న్యాయస్థానాన్ని కోరనుంది. సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై కాంగ్రెస్ నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో కూడా మాట్లాడారు. ఇటీవల హైకోర్టులో ప్రభుత్వం తరఫున సింఘ్వి వాదనలు వినిపించారు.

## లాభం లేదు: మాజీ జేడీ లక్ష్మీనారాయణ

బీసీ రిజర్వేషన్ల అంశంపై సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీనారాయణ స్పందించారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటితే దేశంలో ఏ న్యాయస్థానమైనా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం మరియు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అతిక్రమిస్తే సమస్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం ఈ జీవోపై సుప్రీంకోర్టుకు వెళ్లినా పెద్దగా ప్రయోజనం ఉ ండకపోవచ్చని ఆయన స్పష్టం చేశారు. అనవసరమైన జాప్యం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి శ్రేయస్కరమని లక్ష్మీనారాయణ సూచించారు.

# 16న కేబినెట్ భేటీ

### ఎన్నికలు సహా పలు అంశాలపై చర్చ!

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాష్ట్ర మంత్రిమండలి ఈనెల 16న సమావేశం కానుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించాలని గతంలో కేబినెట్ నిర్ణయించింది. అయితే వరదలు, బీసీ రిజర్వేషన్ల హడావిడి తదితర కారణాలతో కొంతకాలంగా ఈ సమావేశాలు జరగలేదు. కాగా ఈనెల 16న కేబినెట్ సమావేశం జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో ప్రధానంగా ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ప్రారంభించడంపై చర్చించే అవకాశం ఉంది. దీనితో పాటు వివిధ ప్రాజెక్టుల అంచనాలు పెంచడం, మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు, తమ్మిడిహట్టి వద్ద నిర్మాణం, సమ్మక్క–సారక్క ఆనకట్ట, దేవాదుల ఆరో ప్యాకేజీ వంటి అంశాలపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. కేబినెట్‌కు సమర్పించే అవకాశాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో చర్చించారు. గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం, టీ–ఫైబర్ విస్తరణ, మూసీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీకి సంబంధించిన అంశాలు మంత్రివర్గ భేటీలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

# ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి

### అవకాశాలు సృష్టించుకోండి.. సామర్థ్యాన్ని గుర్తించండి.. కలలు కనండి

### జెన్ జీకి కేటీఆర్ పిలుపు.. కోయంబత్తూర్‌లో ఎఫ్ఎంఏఈకి హాజరు

కోయంబత్తూర్: ఉద్యోగులు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా నేటి యువత ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ – నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ 2025కి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా మీరే సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. 'మీరు సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి?' అని ప్రశ్నించారు. "ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారండి. మీరు పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత, మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ఆయన ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, కానీ, "ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత, అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం. తెలంగాణ సాధించిన ప్రగతి.. విశ్వాసానికి, పట్టుదలకు, దార్శనికతకు నిదర్శనం అన్నారు. కోయంబత్తూరులో జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు 2025కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా, దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నేటి



యువతరం, జెన్ జీకి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆకలిని కలిగి ఉండాలని సూచించారు. మీరు ఇతరులు అనుకున్నదాని కంటే తెలివైనవారు, బాధ్యత కలిగినవారు. భారతదేశాన్ని ముందుకు నడిపించేది మీరే" అని విద్యార్థులకు తెలిపారు. మోటార్‌స్పోర్ట్స్ అయినా, పాలన అయినా, జీవితంలో అయినా విజయం కేవలం యాదృచ్ఛికంగా రాదని, "మనం మన అవకాశాలను రూపొందించుకోవాలి, ధైర్యంతో అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్తు నిర్మితమవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.


## విద్య, ఉద్యోగవాణి

### ఢిల్లీ పోలీస్ విభాగంలో ఉద్యోగాలు

మొత్తం పోస్టులు:
**1,289**
దరఖాస్తు చివరి తేదీ:
అక్టోబర్ 15, 2025
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి
పరీక్ష విధానం:
రాత పరీక్ష

# 50 శాతం దాటొద్దు

**పరిధి దాటకుంటే ఎన్నికలకు ఇబ్బంది లేదు.. తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు.. ఎన్నికల ప్రక్రియను ఆపలేదని స్పష్టీకరణ**



హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): గడువు ముగిసినా జరగకుండా నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు హైకోర్టు మార్గం సుగమం చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9ను నిలిపివేసిన ధర్మాసనం, పాత విధానం ప్రకారమే ఎన్నికలతో ముందుకు వెళ్లవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘానికి స్పష్టతనిచ్చింది. మొత్తం రిజర్వేషన్లు ఏ పరిస్థితుల్లోనూ 50 శాతం పరిమితిని దాటకూడదని తేల్చిచెప్పింది. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో 9తో పాటు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన జీఓలు 41, 42లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ జీఓల కారణంగా రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరుకుంటాయని, ఇది సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి విరుద్ధమని పేర్కొంటూ వాటిపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన పూర్తి ఉత్తర్వులు శుక్రవారం రాత్రి అందుబాటులోకి వచ్చాయి. సుప్రీంకోర్టు గతంలో రాహుల్ రమేశ్ వాగ్ కేసులో ఇచ్చిన తీర్పును ధర్మాసనం ప్రస్తావించింది. ట్రిపుల్ టెస్ట్ నిర్వహించే పరిస్థితులు లేనప్పుడు, దామాషా ప్రకారం కేటాయించాల్సిన సీట్లను ఓపెన్ కేటగిరీగా నోటిఫై చేసి ఎన్నికలు నిర్వహించవచ్చని ఆ తీర్పులో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. ఇప్పుడు కూడా అదే విధానాన్ని అనుసరించి ఎన్నికలు జరపవచ్చని సూచించింది. అంతకుముందు ప్రభుత్వం తన వాదనలు వినిపిస్తూ, ట్రిపుల్ టెస్ట్‌కు అనుగుణంగానే కమిషన్ ఏర్పాటు చేసి నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు కల్పించామని తెలిపింది. 50 శాతం పరిమితి అనేది కఠినమైన నియమం కాదని, ప్రత్యేక పరిస్థితుల్లో సవరించుకోవచ్చని వాదించింది. అయితే, ఈ వాదనలతో ప్రాథమికంగా ఏకీభవించని ధర్మాసనం, వికాస్ కిషన్‌రావు గవాలి కేసులో సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని అభిప్రాయపడింది. అదే సమయంలో రాజ్యాంగంలోని అధికరణ 243ఓ ప్రకారం ఎన్నికల ప్రక్రియలో తాము జోక్యం చేసుకోవడం లేదని, సెప్టెంబర్ 29న జారీ చేసిన ఎన్నికల షెడ్యూల్‌ను నిలిపివేయలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కేవలం వివాదాస్పదంగా మారిన రిజర్వేషన్ల జీఓలను మాత్రమే నిలిపివేస్తున్నట్లు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

**హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు**

**ఆలమట్టి ఎత్తు పెంపు.. మౌనం వహించడంపై తీవ్ర విమర్శ**

**కర్ణాటకకు వెళ్లినా కృష్ణా జలాల గురించి మాట్లాడలేదని ఆరోపణ**

**ఢిల్లీకి బ్యాగులు మోయడమే రేవంత్ పని అంటూ సెటైర్**



హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు... నల్లమల పిల్లి" అని ఆయన ఘాటుగా విమర్శించారు. పొరుగు రాష్ట్రాలు కృష్ణా, గోదావరి జలాలను తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో సీఎం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. శనివారం నాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ఇటీవల కర్ణాటకకు వెళ్లిన రేవంత్ రెడ్డి, అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు అంశంపై ఎందుకు మాట్లాడలేదని హరీశ్ రావు నిలదీశారు. "ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుతుందన్న కనీస సోయి రేవంత్ రెడ్డికి లేదు. సొంత పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక ప్రభుత్వంతో రాహుల్ గాంధీ ద్వారా ఒక్క ఫోన్ కూడా చేయించలేని స్థితిలో ఆయన ఉన్నారు" అని విమర్శించారు. ఢిల్లీకి బ్యాగులు మోయడమే కాకుండా, రాష్ట్ర బాగోగులను కూడా పట్టించుకోవాలని హితవు పలికారు. పొరుగు రాష్ట్రాల నీటి వినియోగంపై హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. "ఏపీ 463 టీఎంసీలు, కర్ణాటక 112 టీఎంసీలు, మహారాష్ట్ర 74 టీఎంసీల నీటిని ఆపుకుంటే మన పరిస్థితి ఏంటి? కింద గోదావరి, పైన కృష్ణా నీళ్లు వాళ్లు తీసుకుపోతే మన బతుకులు ఏం కావాలి?" అని ఆయన ప్రశ్నించారు. తరచూ తనను తాను 'నల్లమల బిడ్డ' అని చెప్పుకునే రేవంత్ రెడ్డి, నల్లమలను ఆనుకుని ప్రవహించే కృష్ణా నదికి, మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు. "నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా? పులి అయితే గర్జించేవాడివి. పిల్లివి, ఎలుకవు కాబట్టే మౌనంగా ఉన్నావు" అంటూ తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించారు.

## జూబ్లీహిల్స్ బీజేపీ నేత రాజీనామా

**రిజైన్ చేసిన మాజీ జాయింట్ కన్వీనర్ చెర్క మహేశ్**

**రేవంత్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపణ**

**మాగంటి కుటుంబానికి అండగా ఉంటానని ప్రకటన**



హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం నడుస్తోందని, రెండు పార్టీలు కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపిస్తూ ఓ కీలక నేత బీజేపీకి రాజీనామా చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ మాజీ జాయింట్ కన్వీనర్ చెర్క మహేశ్, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం కమలదళంలో కలకలం రేపింది. ఈ మేరకు తన రాజీనామా లేఖను టీబీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావుకు పంపించారు. సీఎం రేవంత్ రెడ్డితో బీజేపీ నాయకత్వం కుమ్మక్కై అవకాశవాద రాజకీయాలు చేస్తోందని చెర్క మహేశ్ తన లేఖలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "దేశంలో శత్రువులుగా ఉండే కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో మాత్రం కలిసిపోయాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో సామాజిక న్యాయం చేయడంలో రెండు పార్టీలూ విఫలమయ్యాయి" అని ఆయన విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, బీసీ వర్గాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా బీజేపీ ప్రభుత్వం తరఫున గొంతు విప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రయోజనాలను, ప్రజల ఆత్మగౌరవాన్ని బీజేపీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని మహేశ్ ఆరోపించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో గానీ, పార్లమెంట్‌లో గానీ బీజేపీ నేతలు ఏనాడూ ప్రశ్నించిన దాఖలాలు లేవని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో కొనసాగడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఇకపై తన రాజకీయ ప్రయాణం గురించి వివరిస్తూ, దివంగత నేత మాగంటి గోపీనాథ్ కుటుంబానికి అండగా నిలవడమే తన బాధ్యత అని మహేశ్ తెలిపారు. ఈ కష్టకాలంలో ఆయన అర్ధాంగి సునీతకు పూర్తి మద్దతుగా ఉంటానని ప్రకటించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఇకపై ఏ జాతీయ పార్టీలోనూ కొనసాగలేనని తేల్చిచెప్పారు.

## నవీన్ యాదవ్ గెలుస్తారు: భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ అద్భుతమైన ఆధిక్యంతో గెలుపొందడం ఖాయమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ప్రకటించిన తర్వాత ఆయన భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్నికల సన్నాహాలు, ప్రజల అభిప్రాయాలు, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నవీన్ యాదవ్‌కు మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు ప్రకటించారు.



## టీ రూ.5.. బిర్యానీ 170

**ప్రతీ పైసా లెక్క చెప్పాల్సిందే!**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఖర్చులపై ఈసీ నజర్

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచారంలో అభ్యర్థులు చేసే ఖర్చుపై ఎన్నికల సంఘం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. అభ్యర్థుల వ్యయాలకు కళ్లెం వేసేందుకు, పారదర్శకతను పెంచేందుకు అధికారులు కీలక చర్యలు చేపట్టారు. ప్రచారంలో భాగంగా పెట్టే ప్రతి ఖర్చుకూ అధికారికంగా ధరలను నిర్ణయిస్తూ శుక్రవారం ఒక జాబితాను విడుదల చేశారు. ఇకపై అభ్యర్థులు తాము అందించే ఒక కప్పు టీ నుంచి నిర్వహించే పెద్ద సభల వరకు ప్రతీ పైసాకు లెక్క చెప్పాల్సిందే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు తమ ఖర్చులను తక్కువ చేసి చూపకుండా నిరోధించేందుకే ఈ ధరల పట్టికను రూపొందించినట్లు తెలిపారు. అధికారులు ప్రకటించిన ధరల జాబితా ప్రకారం.. ఒక సింగిల్ టీ ధర రూ.5, పెద్ద కప్పు టీ రూ.10గా నిర్ణయించారు. అదేవిధంగా, ప్లేట్ ఇడ్లీ (నాలుగు) రూ.20, ఒక ఆలూ సమోసా రూ.10గా ఖరారు చేశారు. ఇక భోజనాల విషయానికొస్తే, వెజ్ బిర్యానీ (750 గ్రాములు) ధర రూ.115, చికెన్ బిర్యానీ రూ.170, మటన్ బిర్యానీ రూ.180గా పేర్కొన్నారు. కార్యకర్తలకు అందించే నీటి ప్యాకెట్‌కు రూ.2, లీటర్ వాటర్ బాటిల్‌కు రూ.20 చొప్పున లెక్క చూపాల్సి ఉంటుంది. సభలు, సమావేశాల కోసం వినియోగించే వేదికలకు కూడా ధరలను నిర్ణయించారు. ఒక మినీ ఫంక్షన్ హాల్‌కు రోజుకు రూ.6,200, పెద్ద ఏసీ ఫంక్షన్ హాల్‌కు రూ.1,25,000గా ధరను నిర్ధారించారు. ప్రచారంలో ఎక్కువగా వినియోగించే డ్రోన్ కెమెరాకు 12 గంటల వినియోగానికి రూ.5,000గా లెక్క కట్టారు. వీటితో పాటు కుర్చీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు, టీ షర్టులు, సౌండ్ బాక్సుల వంటి అన్ని ప్రచార సామగ్రికి నిర్దిష్ట ధరలను అధికారులు ఈ జాబితాలో చేర్చారు.

## సికింద్రాబాద్-కాజీపేటకు 2 కొత్త రైల్వే లైన్లు

**రూ.2,837 కోట్లతో భారీ ప్రాజెక్టు**

**గంటకు 150 కి.మీ వేగంతో పరుగులు పెట్టనున్న రైళ్లు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): తెలంగాణలోని రద్దీగా ఉండే రైల్వే మార్గాల్లో ఒకటైన సికింద్రాబాద్–కాజీపేట సెక్షన్‌లో ప్రయాణికులకు శుభవార్త. ఈ మార్గంలో ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతమున్న లైన్లకు అదనంగా మరో రెండు రైల్వే లైన్లను నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతా ద్వారా కీలక ప్రకటన చేశారు. మొత్తం 110 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ అదనపు లైన్ల కోసం సుమారు రూ. 2,837 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైల్వే ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రైళ్ల వేగాన్ని పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సికింద్రాబాద్–కాజీపేట మధ్య ప్రయాణానికి ప్రస్తుతం పడుతున్న రెండున్నర నుంచి మూడు గంటల సమయం గంట వరకు తగ్గనుంది. అంటే, రెండు గంటల్లోపే గమ్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుంది. అదనపు లైన్ల నిర్మాణంతో రైళ్ల వేగాన్ని గంటకు 130 నుంచి 150 కిలోమీటర్లకు పెంచేందుకు వీలు కలుగుతుంది. సికింద్రాబాద్–కాజీపేట మార్గం కేవలం తెలంగాణకే కాకుండా, ఉత్తర–దక్షిణ, తూర్పు భారత దేశ ప్రాంతాలను కలిపే కీలకమైన కారిడార్‌గా ఉంది. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లతో పాటు గూడ్స్ రైళ్ల రాకపోకలు కూడా అధికంగా ఉంటాయి. కొత్త లైన్ల నిర్మాణంతో రైళ్ల ఆలస్యం తగ్గి, మరిన్ని రైళ్లను నడిపేందుకు వీలవుతుంది. ముఖ్యంగా గూడ్స్ రైళ్ల సేవలు మెరుగుపడి, సరుకు రవాణా వేగవంతం కానుంది. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన ప్రస్తుతం తుది ఆమోదం కోసం ఎదురుచూస్తోందని, అనుమతులు లభించగానే పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.


## వైజాగ్‌లో తొలి ఏఐ డేటా సెంటర్

**నేడు శంకుస్థాపన చేయనున్న లోకేశ్**

వైజాగ్, అక్టోబర్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం నాడు విశాఖ నగరంలో పర్యటించి, రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం విశాఖ భవిష్యత్ ప్రగతికి నాంది పలకనుందని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి. విశాఖ డేటా సెంటర్ల హబ్ గా రూపుదిద్దుకోనుంది. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి నారా లోకేశ్... ఈ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 12వ తేదీన విశాఖలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాక వల్ల భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతో పాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది. రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధిలో భాగంగా నారా లోకేశ్... నాస్ డాక్ లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ నిర్మించబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను సిఫీ అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తూ.. ఎడ్జ్ స్థాయిలో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించే అవకాశం కల్పిస్తుంది.

## అన్నపర్రు ఘటనపై చంద్రబాబు ఆరా

**అధికారులకు కీలక ఆదేశాలు**



గుంటూరు, అక్టోబర్ 11 (ఈవార్తలు): గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మంత్రి సవిత, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వారిలో ఒక విద్యార్థికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం నిపుణుల సలహా మేరకు మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి సవిత ముఖ్యమంత్రికి తెలియజేశారు. పెదనందిపాడు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారిలో ఇద్దరు మినహా మిగిలిన వారందరినీ డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తర్వాతే వారిని డిశ్చార్జ్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. హాస్టల్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. అన్నపర్రు గ్రామంతో పాటు హాస్టల్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సవిత ఈ సందర్భంగా వివరించారు. కలుషిత ఆహారం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నిర్ధారణ కోసం నీరు, ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, ఆ నివేదికలు వచ్చిన వెంటనే వాటి ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ తేవాలి

**సీఎం రేవంత్ రెడ్డికి చిన్నారెడ్డి లేఖ**

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో వేలాది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, అయితే వారిని ప్రైవేటు ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. ప్రైవేట్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వకపోవడంతో పాటు దాదాపు 20 శాతం వరకు వేతనాల్లో కోత విధిస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ వేతనాలు కూడా ప్రతి నెల ఆలస్యం చేస్తున్నారని వాపోయారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం 2023 కంపెనీస్ యాక్ట్ 8 ప్రకారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కూడా ఇదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్‌ను ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేయాలని చిన్నారెడ్డి కోరారు.



## వీసీ సజ్జనార్‌తో చిరు భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌ను టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిశారు. దాదాపు నాలుగేళ్ల పాటు టీజీఎస్ఆర్టీసీ ఎండీగా పనిచేసిన సజ్జనార్ ఇటీవల హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిరంజీవి సజ్జనార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇరువురు కలిసి పలు అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. గతంలో సైబరాబాద్ సీపీగా సజ్జనార్ పనిచేసిన సమయంలో, కరోనా వ్యాప్తి అధికంగా ఉన్నప్పుడు ప్లాస్మా దానం యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఇరువురు కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో సజ్జనార్ మళ్లీ పోలీస్ యూనిఫామ్ ధరించడంతో చిరంజీవి ఆయనను కలిసి అభినందించారు.

## నాలుగు రోజులు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. శనివారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో... సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## నాపై అక్రమ కేసులు పెట్టారు

**డీజీపీకి రాజాసింగ్ లేఖ**


హైదరాబాద్, అక్టోబర్ 11 (ఈవార్తలు): తనపై హైదరాబాద్ పోలీసులు అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపిస్తూ గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. మధ్యప్రదేశ్‌లో తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి, హైదరాబాద్‌తో సంబంధం లేకుండా కేసులు నమోదు చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసుల వెనుక ఉన్న కారణాలను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన తనపై నమోదైన కేసుల వివరాలను మీడియాకు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ హిందూ సభలో తాను చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలను పోలీసులు వక్రీకరించారని రాజా సింగ్ తన లేఖలో ఆరోపించారు. హైదరాబాద్ నగర పరిధికి సంబంధం లేని విషయంపై ఇక్కడ ఎలా కేసు నమోదు చేస్తారని ఆయన పోలీసులను సూటిగా ప్రశ్నించారు. తనపై మొత్తం 31 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు రాజా సింగ్ తెలిపారు. కాంచన్‌బాగ్, శాలిబండ, నాంపల్లి, అంబర్‌పేట్, బంజారాహిల్స్, ఫలక్‌నుమా, చంద్రాయణగుట్టతో పాటు కర్ణాటకలోని బీదర్, బస్వకళ్యాణ్ పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## బొత్సకు జగన్ నుంచి ప్రాణహాని

**పల్లా శ్రీనివాసరావు ఆరోపణలు**

వైజాగ్, అక్టోబర్ 11 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణకు వారి పార్టీ అధినేత జగన్ నుంచే ప్రాణహాని ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేశారు. తనకు ప్రాణహాని ఉందని స్వయంగా బొత్స ప్రకటించిన నేపథ్యంలో, ఆయనకు ప్రభుత్వపరంగా పూర్తి భద్రత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పల్లా ప్రకటించారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బొత్స మాటలను బట్టి చూస్తే, ఆయనకు వైసీపీ నుంచే ముప్పు పొంచి ఉందని స్పష్టమవుతోందని పల్లా అన్నారు.

## సోషల్ వాణి




సుప్రీంకి పోయినా ఫలితం ఇలాగే ఉంటుంది (బీసీ రిజర్వేషన్లపై). ఇదీ కంటితుడుపు చర్యే. సమయం, ప్రజాధనం వృథా. రాజ్యాంగ సవరణే లక్ష్యం. ప్రతి బీసీ అంబేద్కర్ కావాలి.

- పులికొండ సుబ్బాచారి (నటుడు ప్రియదర్శి తండ్రి)



## ధర్మపురిలో చాగంటి ప్రవచనాలు

**పాల్గొన్న మంత్రి అడ్లూరి, కలెక్టర్ సత్యప్రసాద్**

ధర్మపురి, అక్టోబర్ 11 (ఈవార్తలు): ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక ప్రవచనముల కార్యక్రమానికి చాగంటి కోటేశ్వర్‌రావు విచ్చేశారు. ఈసందర్భంగా ఆలయం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీమఠం స్థలంలో కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొని చాగంటి ధార్మిక ఉపన్యాసాన్నిఆలకించారు.

# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**పేద, మధ్యతరగతికి ఆర్థిక భరోసా**

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**




జగిత్యాల టౌన్, అక్టోబర్ 11 (ఈవార్తలు): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదల పాలిట వరం అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల పట్టణ మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో.. 55 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.15 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తూ నిధులు కేటాయిస్తోందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక ఈజీఎస్,ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు జగిత్యాలకు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అత్యధికంగా 14 పల్లె దవాఖానలు జగిత్యాలకే మంజూరయ్యాయని వివరించారు. సీఎంతో కలిసి జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. 'రూ.5 కోట్లతో మహిళలకు ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణం చేపట్టాం. టీఆర్ నగర్ లో రూ.5 కోట్లతో ఏటీసీ కేంద్రం నిర్మాణం పూర్తి చేసి, రూ.40 కోట్ల తో మిషనరీ ఏర్పాటు చేశాం, తరగతులు కూడా జరుగుతున్నాయి. చల్‌గల్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ మంజూరైంది. 20 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ హాస్పిటల్ పూర్తయ్యింది. త్వరలో ప్రారంభం కానుంది. రూ.203 కోట్లతో జగిత్యాలకు నూతన ఆసుపత్రి మంజూరైంది' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, బాలె శంకర్, తాజా మాజీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, యూత్ నాయకులు, మహిళలు తదితరులుపాల్గొన్నారు.



## కోతులతో పంటలు నాశనం

**ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: జీవన్ రెడ్డి**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 11 (ఈవార్తలు): కోతుల వల్ల కష్టపడి పండించిన పంటలు నాశనం అవుతున్నాయని మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాలలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. కోతుల నియంత్రణకు పునరుత్పత్తి కేంద్రాలు (స్టెరిలైజేషన్ సెంటర్స్) ఏర్పాటు చేయడమే శాశ్వత పరిష్కారం అని అన్నారను. ప్రతి మండలానికి కనీసం ఒక పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేస్తే, అది జీవితకాలంలో గుర్తుండిపోయే ప్రజా సేవగా నిలుస్తుందని చెప్పారు. రైతుల పొలాల వద్ద సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం సబ్సిడీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



## పీపీపీపై అభ్యంతరం ఎందుకు?

**వైసీపీపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం**

అమరావతి, అక్టోబర్ 11 (ఈవార్తలు): ఏపీలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా సమర్థించుకున్నారు. పేదలకు నాణ్యమైన, ఉచిత వైద్యాన్ని వేగంగా అందించాలన్నదే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో వైసీపీ ఎందుకు అభ్యంతరం చెబుతోందని ఆయన సూటిగా ప్రశ్నించారు. తాను ఏ కార్యక్రమం చేపట్టినా పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే చేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుల విధానాలను అనుసరిస్తే రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి కావడానికి కనీసం 20 ఏళ్లు పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అదే పీపీపీ విధానంలో అయితే కేవలం రెండేళ్లలోనే నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావచ్చని ఆయన వివరించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని పేద విద్యార్థులకు అదనంగా 110 మెడికల్ సీట్లు లభిస్తాయని, వారి వైద్య విద్య కలను సాకారం చేసేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేతల తీరుపై చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "మీలో ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే వెంటనే కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కానీ, అదే నాణ్యమైన వైద్య సేవలు పేద ప్రజలకు అందకూడదా?" అని ఆయన నిలదీశారు. ప్రజలకు మంచి చేస్తుంటే అడ్డుకోవడం సరికాదని, పీపీపీ విధానం ద్వారా పేదలకు మేలు జరుగుతుంటే ఎందుకు విమర్శిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## వందేళ్ల ముందుచూపుతో

# రాజన్న గుడి అభివృద్ధి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి.. భీమన్న గుడికి ఉత్సవ మూర్తులు.. కోడె మొక్కులు చెల్లింపు**



వేములవాడ , అక్టోబర్ 11 (ఈవార్తలు): వేములవాడ రాజన్న, భీమన్నల ఆశీస్సులతో లోకకల్యాణం జరగాలని, రాష్ట్ర ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధిలో భాగంగా శనివారం ఉదయం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలోని ఉత్సవమూర్తులైన పార్వతిరాజరాజేశ్వర స్వామి, శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారలను రాజన్న ఆలయం నుంచి అర్చక పరివారంతో ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో ఊరేగింపుగా భీమన్న ఆలయానికి తీసుకువచ్చారు. ఈవోతో కలిసి భీమన్న ఆలయంలో కోడెమొక్కును చెల్లించుకున్నారు. శ్రీభీమేశ్వర, శ్రీనగరేశ్వర స్వామి వారి ఆలయాల్లో ఏర్పాటు చేసిన పలు ఆర్జిత సేవలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు భీమేశ్వర ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, సలహాలు, సూచనలు తీసుకుని ఆలయ విస్తరణ చేపడుతున్నామన్నారు. రాజన్న ఆలయంలో జరుగుతున్న పనుల నేపథ్యంలో స్వామి వారికి ఏకాంత సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. శ్రీపార్వతిపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను, క్షేత్రపాలకుడు అనంత పద్మనాభస్వామి ఉత్సవమూర్తులను భీమేశ్వర ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఆర్జిత సేవలు కల్పిస్తామన్నారు. రానున్న మరో వంద సంవత్సరాల వరకు భక్తులక ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈనెల 19వ తేదిన శృంగేరి పీఠాధిపతి విదిశేఖర భారతి శర్మ స్వామి వేములవాడకు రానున్నారని, శ్రీస్వామి వారిని దర్శించుకుని పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, అశోక్, శ్రీనివాస్, జయకుమారి కాంగ్రెస్ నాయకులు రొండి రాజు, కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నిత్యానందరావు, నాగం కుమార్, పిల్లి కనుక్యయ్య, గాలిపెల్లి స్వామి, పాత సత్యలక్ష్మీ తదితరులు ఉన్నారు. అటు.. వేములవాడ భీమేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం కోడెమొక్కులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించి కోడెమొక్కులను ప్రారంభించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోడె మొక్కు చెల్లించుకున్నారు.

# ఆరోగ్యశ్రీని చంపే కుట్ర: విడదల రజిని



గుంటూరు, అక్టోబర్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య ఆరోగ్య రంగం పూర్తిగా నిర్వీర్యమైపోయిందని వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పేదలకు సంజీవని అయిన 'ఆరోగ్యశ్రీ' పథకం 'అనారోగ్యశ్రీ'గా మారిపోయిందని ఆమె తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో వైద్య వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుమారు 3 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని విడదల రజిని తెలిపారు. బకాయిల కోసం ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు లేఖలు రాసినా స్పందన లేదని అన్నారు. దీంతో చేసేదేమీ లేక నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలను నిలిపివేసి, బోర్డులు తిప్పేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో వైద్య సేవలు నిలిచిపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు, నెట్‌వర్క్ డాక్టర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం దారుణమని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పరిధిని 1,059 వ్యాధుల నుంచి 3,257కి పెంచామని, నెట్‌వర్క్ ఆసుపత్రులను 900 నుంచి 2,300కి విస్తరించామని రజిని గుర్తుచేశారు. ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య ఆసరా వంటి పథకాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెచ్చిన ఆరోగ్యశ్రీని చంపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రజిని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తమ ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ప్రారంభించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే పనుల్లో ప్రభుత్వం బిజీగా ఉందని ఆరోపించారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసిన ఆమె, ప్రజా వ్యతిరేక విధానాలపై వైసీపీ పోరాటం కొనసాగిస్తుందనిస్పష్టంచేశారు.

## ఇక భీమన్న గుడిలో దర్శనాలు

**రాజన్న గుడిలో దర్శనాలు నిలిపివేత,, ఏకాంత సేవలు కొనసాగింపు**

వేములవాడ, అక్టోబర్ 11 (ఈవార్తలు): వేములవాడ శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం నుంచి శ్రీరాజరాజేశ్వర స్వామివారి దర్శనాలు నిలిపివేయనున్నట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. భీమేశ్వరస్వామి వారి ఆలయంలో దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యంగా భక్తులు.. కోడెమొక్కులు, అభిషేకాలు, అన్నపూజ, ఇతర పూజలన్నీ భీమేశ్వరస్వామి వారి ఆలయంలోనే చేసుకొవాలన్నారు. వేములవాడ రాజన్న గుడి విస్తరణలో భాగంగా కొన్ని నెలల పాటు దర్శనాల నిలిపివేస్తున్నట్లు ఈవో తెలిపారు. అదే విధంగా స్వామివారికి అభిషేకాలు, పూజలు,నైవేద్యాలు, ఇతర అన్నిరకాల కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయన్నారు. ఆలయం డెవలప్ మెంట్ పనులు పూర్తయ్యాక మరల దర్శనాలకు అనుమతినిస్తామని భక్తులు ఈ విషయాల్ని గమనించాలని పేర్కొన్నారు.



## కేంద్రాన్ని ఒప్పించి రిజర్వేషన్లు తేవాలి

**బీసీ సాధికారత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొండ దేవయ్య**

వేములవాడ, అక్టోబర్ 11 (ఈవార్తలు): అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రాన్ని ఒప్పించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని బీసీ సాధికారత సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన బీసీ సాధికారిత సంఘం వేములవాడ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ ఆధ్వర్యంలో ముఖ్య బీసీ నేతల సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దేవయ్య.. కేంద్రాన్ని, రాష్ట్రపతిని, గవర్నర్‌ను ఒప్పించి, రాజ్యాంగబద్ధంగా షెడ్యూల్ 9లో చేర్పించుటకు కృషి చేయాలని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అమల్లో రాజకీయ పార్టీల నేతలు ఒకరిపై ఒకరు బురద చల్లుకోకుండా, సమిష్టిగా, సమన్వయంతో, సమాలోచనలతో, కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్, జిల్లా నేతలు సీహెచ్ రామస్వామి గౌడ్, కుంభం రవీందర్, చేను హెలపతి, ఏట్టెం సాయి కృష్ణ, ఎంద్రాల నాగరాజు, ముద్రకోల నర్సయ్య, ముద్రాకోల గణేశ్, అన్నారపు దేవయ్య, కే రాములు తదితరులుపాల్గొన్నారు.

## రియల్టర్ హత్య కేసులో ఏ1 అరెస్టు

వేములవాడ, అక్టోబర్ 11 (ఈవార్తలు): గత నెల 19న హత్యకు గురైన సిరిగిరి రమేశ్ కేసులో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు ప్రధాన నిందితుడు చిర్రం రవిని అరెస్టు చేశారు. పెద్దూరు సబ్‌స్టేషన్ సమీపంలో జరిగిన ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రవి.. ఆ రోజు నుంచి పరారీలో ఉన్నాడు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం రవిని పట్టుకొని, రిమాండ్‌కు తరలించారు.

## మానేరులో పడి వ్యక్తి దుర్మరణం

తంగళ్లపల్లి, అక్టోబర్ 11 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళపల్లి మండలంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మానేరు నదిలో పడి దుర్మరణం చెందాడు. కస్బె కట్కూర్ గ్రామంలోని మానేరు నది చెక్ డ్యాంలో బాలరాజు పడిపోయాడు. దీంతో ప్రాణాలు కోల్పోయాడు. బాలరాజు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నాపై కుట్ర చేస్తున్నారు: బొత్స

వైజాగ్, అక్టోబర్ 11 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, ఏపీ శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రత్యర్థులపై సంచలన ఆరోపణలు చేశారు. తనను అంతమొందించేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల పైడితల్లి సిరిమానోత్సవంలో బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్న వేదిక కూలిపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ విజయనగరంలో మీడియా సమావేశంలో ప్రత్యర్థులపై ఆరోపణలు చేశారు. వేదిక కూలిన ఘటనపై విచారణ చేపట్టాలని బొత్స డిమాండ్ చేశారు. ఈ విషయంపై గవర్నర్, సీఎంకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. పైడితల్లి సిరిమానోత్సవంలో తన కుటుంబ సభ్యులతో పాటు వైసీపీ నాయకుల కోసం ఏర్పాటు చేసిన వేదిక ఎలా కూలిందని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో కలెక్టర్, ఎస్పీకి బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. దీని వెనుక ఎవరున్నా బయటకు లాగుతామని అన్నారు. బొత్స చేసిన ఈ సంచలన ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.

## దళితులను రెచ్చగొట్టే దుశ్చర్యలు: అనిత

చిత్తూరు, అక్టోబర్ 11 (ఈవార్తలు): చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు దహనం చేసిన ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ చర్య వెనుక రాజకీయ కుట్ర ఉందని, దళితులను రెచ్చగొట్టేందుకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. శనివారం దేవళంపేటలో పర్యటించిన మంత్రి, అగ్నికి ఆహుతైన అంబేద్కర్ విగ్రహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, "అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన నిందితులను త్వరలోనే పట్టుకుని కఠినంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక కొందరు కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో జరిగిన డాక్టర్ సుధాకర్, డాక్టర్ అనితా రాణి ఘటనలపై జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు.


## పుస్తకాలతో మానసిక పరిపక్వత



విజయవాడ, అక్టోబర్ 11 (ఈవార్తలు): పుస్తకాలు చదవడం ద్వారానే మానసిక పరిపక్వత సాధ్యమవుతుందని, తన జీవితంపై పుస్తకాల ప్రభావం ఎంతో ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఏ విషయంలోనైనా సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని, తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' అనే పుస్తకాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఒక పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటాం. ఏదైనా సాధించాలంటే పట్టుదల చాలా అవసరం. ఈ పుస్తకంలోని మాలతి పాత్ర నాకు ఎంతగానో స్ఫూర్తినిచ్చింది. ఆ పాత్రలో ధైర్యసాహసాలు, మేధస్సు, స్వాతంత్ర్య కాలం నాటి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కనిపిస్తాయి" అని వివరించారు. తన తల్లి వంట గది నుంచే ప్రపంచాన్ని చూశారని గుర్తుచేసుకున్నారు. భారతీయ ఆలోచనా విధానం నుంచే తాను వచ్చానని, మన దేశంలో స్త్రీకి అత్యున్నత గౌరవం ఉందని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ మహిళా విభాగానికి 'ఝాన్సీ వీర మహిళ' అని పేరు పెట్టినట్లు గుర్తుచేశారు. ఇదే వేదికపై పవన్ కల్యాణ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను త్వరలోనే అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ నా అభిమాన నాయకుడు. నేను ఈ రోజు మంత్రిగా కాకుండా సాధారణ వ్యక్తిగా వచ్చి ఉంటే, మీ అందరితో కలిసి కింద కూర్చుని 'పవర్ స్టార్', 'ఓజీ' అని గట్టిగా అరిచేవాడిని" అని తన అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## దుర్గగుడి చీరల వేలంలో రికార్డు

**రూ. 8.15 కోట్లకు టెండర్ ఖరారు**



విజయవాడ, అక్టోబర్ 11 (ఈవార్తలు): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించే చీరల ద్వారా ఆలయానికి వచ్చే ఆదాయం రికార్డు స్థాయిలో పెరిగింది. పూర్తి పారదర్శకంగా నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయ ఖజానాకు భారీగా రాబడి సమకూరింది. గతంతో పోలిస్తే ఏడాదికి ఏకంగా రూ. 2.50 కోట్లకు పైగా అదనపు ఆదాయం రావడం గమనార్హం. శుక్రవారం ఆలయ మహామండపంలో నిర్వహించిన చీరల సేకరణ టెండర్ల ప్రక్రియలో గుంటూరుకు చెందిన శ్రీ పావని కలెక్షన్స్ సంస్థ ఏడాదికి రూ. 8.15 కోట్లకు టెండర్‌ను దక్కించుకుంది. రాబోయే రెండేళ్లపాటు అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టు, కాటన్, సాధారణ చీరలతో పాటు జాకెట్ ముక్కలను ఈ సంస్థ సేకరించనుంది. ఈ టెండర్ ప్రక్రియలో మొత్తం మూడు సంస్థలు పోటీపడగా, శ్రీ పావని కలెక్షన్స్ అత్యధిక మొత్తానికి పాడి దక్కించుకుంది. గతంలో రెండేళ్ల కాలానికి ఓ ప్రైవేటు సంస్థకు ఏడాదికి కేవలం రూ. 5.50 కోట్ల చొప్పున మాత్రమే చీరల సేకరణ కాంట్రాక్టును అప్పగించారు. అయితే, తాజాగా నిర్వహించిన పారదర్శక వేలం పాటతో ఆలయ ఆదాయం ఒక్కసారిగా 35 శాతం పెరిగింది. ఈ వ్యూహాత్మక చర్యతో రాబోయే రెండేళ్లలో ఆలయానికి సుమారు రూ. 16.30 కోట్ల ఆదాయం సమకూరనుంది. కమిషనర్ రామచంద్రమోహన్ సూచనల మేరకు పక్కా ప్రణాళికతో, పూర్తి పారదర్శకంగా ఈ టెండర్లను నిర్వహించామని ఆలయ ఈఓ శ్రీనానాయక్ తెలిపారు. గతంలో ఈ టెండర్ల విషయంలో లాబీయింగ్ జరిగాయన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈసారి ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా బహిరంగ వేలం నిర్వహించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# చొరబాట్ల వల్లే ముస్లిం జనాభా

## కేంద్రమంత్రి అమిత్ షా వెల్లడి.. చొరబాట్లు దేశ భద్రతకు పెను ముప్పుగా వర్ణన

న్యూఢిల్లీ: దేశంలోని కొన్ని ప్రాంతాలలో ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అక్రమ చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదని, దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దైనిక్ జాగరణ్' మాజీ సంపాదకుడు నరేంద్ర మోహన్ స్మారకోపన్యాసంలో అమిత్ షా ఈ మేరకు మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లోని జనాభా లెక్కలను ఉటంకిస్తూ అమిత్ షా తన వాదనను వినిపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అసోంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం పెరిగిందని, చొరబాట్లు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి అసాధ్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం వరకు, సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా 70 శాతం వరకు ఉందని తెలిపారు. ఇవన్నీ గతంలో జరిగిన చొరబాట్లకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని అమిత్ షా తీవ్రంగా ఆరోపించారు. "గుజరాత్, రాజస్థాన్‌లకు కూడా సరిహద్దులు ఉన్నాయి. మరి అక్కడ నుంచి చొరబాట్లు ఎందుకు జరగడం లేదు?" అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చొరబాట్లను అడ్డుకోవడం కేవలం కేంద్ర ప్రభుత్వం లేదా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) బాధ్యత మాత్రమే కాదని ఆయన స్పష్టం చేశారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా అన్ని సరిహద్దు ప్రాంతాల్లో కంచె వేయడం సాధ్యం కాదని, అలాంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత కీలకమని అమిత్ షా వివరించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని స్థానిక జిల్లా యంత్రాంగం గుర్తించడంలో విఫలమైతే చొరబాట్లను ఎలా ఆపగలమని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాట్ల కారణంగానే ఝార్ఖండ్‌లో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



## అమెరికాలో భారీ పేలుడు..

**19 మంది మృతి!**

న్యూయార్క్: అగ్రరాజ్యం అమెరికాలో ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. టేనస్సీ రాష్ట్రంలోని ఓ పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ ప్రమాదంలో 19 మంది మరణించి ఉండవచ్చని అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సైనిక, అంతరిక్ష, వాణిజ్య రంగాలకు అవసరమైన పేలుడు పదార్థాలను ఉత్పత్తి చేసే ఈ కంపెనీలో జరిగిన ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. హంఫ్రీస్ కౌంటీ షెరీఫ్ క్రిస్ డేవిస్ ఈ ఘటనపై మాట్లాడుతూ, ఇది అత్యంత వినాశకరమైన పేలుడు అని అభివర్ణించారు. "ప్రమాదం జరిగిన తర్వాత చాలా మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. ప్రస్తుతం కొంతమంది మాత్రమే సురక్షితంగా ఉన్నట్లు సమాచారం ఉంది. మిగిలిన వారంతా మరణించి ఉండే అవకాశం ఉంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పేలుడు తీవ్రత ఎంతగా ఉందంటే, ఫ్యాక్టరీకి సమీపంలోని ఇళ్లు సైతం తీవ్రంగా కంపించాయి. దీంతో ఏం జరిగిందో తెలియక స్థానిక ప్రజలు భయంతో ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. పేలుడు ధాటికి భవనం పూర్తిగా శిథిలాల కుప్పగా మారింది. ప్రమాద తీవ్రత కారణంగా సహాయక చర్యలకు కూడా తీవ్ర ఆటంకం ఏర్పడింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి సకాలంలో చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ దుర్ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మృతుల సంఖ్యపై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

## కేబినెట్ విస్తరణ వార్తలు అబద్ధం

**కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్**



బెంగళూరు: కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ లేదా మార్పులపై గత కొద్ది రోజులుగా సాగుతున్న ప్రచారానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెరదించారు. అవన్నీ నిరాధారమైన వదంతులేనని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ లేదని ఆయన శనివారం స్పష్టం చేశారు. బెంగళూరులోని లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్‌లో జరిగిన 'బెంగళూరు వాక్' కార్యక్రమంలో ప్రజలతో ముచ్చటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం కేబినెట్ విస్తరణ జరగడం లేదు. దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురిస్తున్నాయి. ఇలాంటి ప్రతిపాదన ఏదైనా ఉంటే ముఖ్యమంత్రి గానీ, నేను గానీ సూచించాలి. మేమిద్దరం అలాంటిదేమీ చెప్పనప్పుడు, అదంతా తప్పుడు ప్రచారమే అవుతుంది. ఏదైనా ఉంటే అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుంది" అని శివకుమార్ స్పష్టం చేశారు. డీకే శివకుమార్ మంత్రివర్గ విస్తరణ వార్తలను ఖండిస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్టోబర్ 13న కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా విందు సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. బీహార్ ఎన్నికల తర్వాత కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని సీఎం సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు, వాల్మీకి జయంతి వేడుకల్లో మాట్లాడిన సిద్ధరామయ్య, తదుపరి పునర్వ్యవస్థీకరణలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నేతకు తప్పకుండా మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే, రాబోయే మున్సిపల్, జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలపై చర్చించేందుకే సీఎం విందు సమావేశం ఏర్పాటు చేశారని శివకుమార్ అంటున్నారు.

## మాకేం తెల్వదు

**మహిళా జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరణపై కేంద్రం వివరణ**

న్యూఢిల్లీ: ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ సమావేశానికి మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో భారత ప్రభుత్వం తాజాగా స్పందించింది. ఈ ప్రెస్ మీట్ నిర్వహణలో తమకు ఎలాంటి పాత్ర లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయంలో శుక్రవారం ఈ మీడియా సమావేశం జరిగింది. అయితే, దీనికి మహిళా జర్నలిస్టులెవరినీ అనుమతించలేదు. కొంతమంది మహిళా రిపోర్టర్లను లోపలికి రాకుండా అడ్డుకున్నారని కూడా వార్తలు వచ్చాయి. దీంతో పలువురు జర్నలిస్టులు సోషల్ మీడియా వేదికగా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. తామంతా నిబంధనల ప్రకారం డ్రెస్ కోడ్ పాటించినా అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ వివరణనిచ్చింది. ముంబైలోని ఆఫ్ఘన్ కాన్సుల్ జనరల్ కార్యాలయం నుంచి ఢిల్లీలోని కొందరు జర్నలిస్టులను ఎంపిక చేసి ఆహ్వానాలు పంపారని తెలిపింది. ఆఫ్ఘన్ రాయబార కార్యాలయ ప్రాంగణం భారత ప్రభుత్వ పరిధిలోకి రాదని స్పష్టం చేసింది.

## చెన్నైలో మారనున్న 3,400 వీధుల పేర్లు

**కులాల పేర్లతో ఉన్న వీధుల పేర్ల తొలగింపునకు శ్రీకారం**

చెన్నై: చెన్నై నగరంలో సామాజిక సంస్కరణల దిశగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నగరవ్యాప్తంగా కులాల పేర్లతో ఉన్న సుమారు 3,400 వీధుల పేర్లను మార్చే ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ వీధులకు బదులుగా ప్రముఖ నాయకులు, పువ్వుల పేర్లు లేదా ఇతర సామాజికంగా తటస్థంగా ఉండే పేర్లను పెట్టనున్నారు. కుల గుర్తింపులను తొలగించాలన్న తమిళనాడు ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. నగరంలో మొత్తం 35,000 వీధులు ఉండగా, వాటిలో సుమారు 3,400 వీధులకు కులాల పేర్లు ఉన్నట్లు డిప్యూటీ మేయర్ మహేశ్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా, నగరంలో కొత్తగా విలీనమైన ఏడు జోన్లలో ఇలాంటి వీధులు ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 19వ తేదీలోగా ఈ వీధులన్నింటికీ కొత్త పేర్లు పెట్టే ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ సహకారంతో ఈ వీధుల జాబితాను అధికారిక రిజిస్టర్ల ఆధారంగా ధ్రువీకరిస్తున్నామని, సోమవారాని కల్లా తుది జాబితా సిద్ధమవుతుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎన్. తిరుమురుగన్ వివరించారు. జాబితా ఖరారైన తర్వాత, సంబంధిత వార్డుల కౌన్సిలర్లు 'ఏరియా సభ' సమావేశాలు నిర్వహించి, ప్రజల ఏకాభిప్రాయంతో కొత్త పేర్లను నిర్ణయిస్తారు. పేర్ల మార్పు ప్రక్రియకు అధికారులు స్పష్టమైన విధానాన్ని అనుసరించనున్నారు. పేరు మొత్తం కులాన్ని సూచిస్తే, దాని స్థానంలో నాయకులు లేదా పువ్వుల పేర్లు పెడతారు. మార్పు కోసం గుర్తించిన వాటిలో కొడంబాక్కంలోని గంగురెడ్డి రోడ్, రెడ్డి స్ట్రీట్, వన్నియార్ స్ట్రీట్, సైదాపేటలోని బ్రాహ్మిణ్ స్ట్రీట్ వంటివి ఉన్నాయి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత, కొత్త పేర్లతో త్రీడీ రిఫ్లెక్టివ్ నేమ్ బోర్డులను ఏర్పాటు చేయడానికి టెండర్లను పిలవనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఢిల్లీ-చైనా ఇండిగో డైరెక్ట్ ఫ్లైట్

న్యూఢిల్లీ: భారత్, చైనా మధ్య సుమారు ఐదేళ్ల విరామం తర్వాత విమానయాన సంబంధాలు మళ్లీ బలపడుతున్నాయి. ప్రముఖ బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగో ఈ దిశగా మరో కీలక ముందడుగు వేసింది. ఢిల్లీ నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌ నగరానికి నవంబర్ 10 నుంచి రోజువారీ డైరెక్ట్ విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. ఇండిగో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మార్గంలో ఎయిర్‌బస్ ఏ320 విమానాన్ని నడపనున్నారు. ఢిల్లీలో రాత్రి 9:45 గంటలకు బయలుదేరే విమానం, మరుసటి రోజు ఉదయం 4:40 గంటలకు గ్వాంగ్‌జౌ చేరుకుంటుంది. తిరిగి గ్వాంగ్‌జౌలో ఉదయం 5:50 గంటలకు బయలుదేరి, అదే రోజు ఉదయం 10:10 గంటలకు ఢిల్లీకి చేరుకుంటుంది. ఈ సర్వీసులకు సంబంధించిన టికెట్ల బుకింగ్ ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో ప్రారంభమైనట్లు సంస్థ తెలిపింది.

## ఐర్లాండ్‌లో భారత యువతిపై దాడి

డబ్లిన్: ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో నివసిస్తున్న స్వాతి వర్మ అనే భారత యువతికి ఒక భయానక అనుభవం ఎదురైంది. జిమ్ నుంచి ఇంటికి నడిచి వెళుతున్న ఆమెపై గుర్తు తెలియని మహిళ జాత్యహంకార దూషణలకు పాల్పడింది. అక్టోబర్ 8న జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగుతోంది. స్వాతి వర్మ తన ఇంటికి సమీపంలో ఉండగా, డబ్లిన్ సిటీ యూనివర్సిటీ (డీసీయూ) బ్యాడ్జ్ ధరించిన ఒక మహిళ ఆమెను సమీపించింది. దారి అడుగుతుందేమోనని స్వాతి భావించగా ఆమె అనూహ్యంగా "నువ్వు ఐర్లాండ్‌కు ఎందుకొచ్చావు? ఇక్కడ ఏం చేస్తున్నావు? మీ దేశానికి తిరిగి వెళ్లిపో" అంటూ దురుసుగా ప్రశ్నించడం ప్రారంభించింది. ఈ అనూహ్య పరిణామంతో స్వాతి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ మహిళ అక్కడితో ఆగకుండా "నీకు వర్క్ వీసా ఉందా?" అని ప్రశ్నించింది. దానికి స్వాతి బదులిస్తూ "అవును, నేను ఇక్కడ ఉచితంగా ఉండటం లేదు. పన్నులు చెల్లిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు నా వంతు సహకారం అందిస్తున్నాను" అని స్పష్టం చేశారు. అయితే, ఆ మహిళ "నువ్వు చేసిన అతిపెద్ద తప్పు అదే.. వెంటనే ఇండియాకు తిరిగి వెళ్లు" అని బదులిచ్చింది. ఈ సంభాషణలో కొంత భాగాన్ని స్వాతి తన ఫోన్‌లో రికార్డ్ చేశారు. ఆ వీడియోలో, "నువ్వు ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుని యజమానులకు డబ్బులిస్తున్నావు. వాళ్లకు అధికారం ఇస్తున్నావు. కానీ, నేనే అధికారం, నేనే శక్తిని" అంటూ ఆ మహిళ వింతగా మాట్లాడటం వినిపిస్తోంది. ఈ క్రమంలో ఒక బాటసారి కల్పించుకోగా, అతడిపై కూడా ఆమె అదే విధంగా దూషణలకు దిగింది. ఈ దాడితో తాను తీవ్రంగా భయపడ్డానని, షాక్‌కు గురయ్యానని స్వాతి తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. తాను సురక్షితంగా ఉండాలన్నదే తన మొదటి ఆలోచన అని తెలిపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, స్వాతికి భారీగా మద్దతు లభిస్తోంది. ఆమె ధైర్యాన్ని, సంయమనాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# బీహార్‌లో మజ్లిస్ ఒంటరి పోరు

**100 స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రణాళిక**




పాట్నా/హైదరాబాద్: బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఏకంగా 100 స్థానాల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించింది. 'ఇండియా' కూటమి నుంచి పొత్తు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో, ఒంటరిగా తమ బలాన్ని నిరూపించుకోవాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ పరిణామం బీహార్ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదు రెట్లు ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగుతున్నామని ఎంఐఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ శనివారం వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ (ఇండియా కూటమి) కూటములకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ శక్తిగా ఎదగడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "మా ఉనికిని ఇటు ఎన్డీఏ, అటు మహాఘట్‌బంధన్ గుర్తించేలా చేస్తాం. మా బలాన్ని తక్కువ అంచనా వేయలేరు" అని ఆయన అన్నారు. పొత్తు కోసం ఆర్జేడీ అధినేతలు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌లకు తాను లేఖ రాసినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని అఖ్తరుల్ ఇమాన్ తెలిపారు. "వారి నుంచి స్పందన లేనప్పుడు, మా పార్టీ బలాన్ని విస్తరించుకోవడానికి మేము అన్ని విధాలా ప్రయత్నించాలి. ఇప్పటికే కొన్ని భావసారూప్యత కలిగిన పార్టీలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు విషయమై చర్చిస్తున్నాం. మరికొన్ని రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది" అని ఆయన వివరించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఐదు స్థానాల్లో గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే, ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరడంతో ప్రస్తుతం అఖ్తరుల్ ఇమాన్ మాత్రమే పార్టీ ఏకైక శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. బీహార్‌లో 17 శాతానికి పైగా ఉన్న ముస్లిం జనాభానే లక్ష్యంగా చేసుకుని ఎంఐఎం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇటీవల పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా సీమాంచల్ ప్రాంతంలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎంఐఎం పోటీతో సెక్యులర్ ఓట్లు చీలి బీజేపీకి లాభం చేకూరుతుందని విపక్షాలు ఆరోపిస్తుండగా, తమ పార్టీ ఏ కూటమికి 'బీ-టీమ్' కాదని ఎంఐఎం నేతలు స్పష్టం చేస్తున్నారు.

# మెడికోపై గ్యాంగ్ రేప్

**బెంగాల్‌లో మరో ఘటన**

**ఒడిశాకు చెందిన యువతిపై అడవిలో అఘాయిత్యం**



కోల్‌కతా: బెంగాల్ ఆర్జీ కర్ వైద్య కళాశాల ఘటన మరువకముందే, పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ బర్ధమాన్ జిల్లా దుర్గాపూర్‌లో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న ఒడిశాకు చెందిన విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ అమానవీయ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన బాధితురాలు శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో తన క్లాస్‌మేట్‌తో కలిసి భోజనం కోసం కాలేజీ ప్రాంగణం నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో కొందరు దుండగులు వారిని అడ్డగించి వేధించడం మొదలుపెట్టారు. భయంతో ఆమె స్నేహితుడు అక్కడి నుంచి పారిపోగా, ఒంటరిగా చిక్కిన యువతిని సమీపంలోని పొదల్లోకి లాక్కెళ్లి ఈ దారుణానికి పాల్పడ్డారని అసన్సోల్-దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు. అనంతరం నిందితులు ఆమె ఫోన్‌ను కూడా లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై కాలేజీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. "ఇక్కడ మా కుమార్తె చదువును కొనసాగించబోము. తనని ఇంటికి తీసుకెళ్లిపోతాం" అని ఆమె తల్లిదండ్రులు మీడియాతో అన్నారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలు అర్చనా మజుందార్ ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించకపోవడం వల్లే అత్యాచారాలు, లైంగిక దాడులు పెరుగుతున్నాయి. బెంగాల్‌లో ఏ ఒక్క రేపిస్టుకు ఉరిశిక్ష పడినట్లు మేము చూడలేదు" అని ఆమె వ్యాఖ్యానించారు. న్యాయం ఆలస్యం కావడం వల్లే నేరస్థులకు భయం లేకుండా పోతోందని ఆమె అభిప్రాయపడ్డారు. నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## 9 రోజులు సెలవు.. దీపావళి ఆఫర్

**ఎంబసీ గ్రూప్, పీర్ సంస్థ ఎలైట్ మార్క్ నిర్ణయం**

న్యూఢిల్లీ: దేశంలోని కొన్ని సంస్థలు తమ ఉద్యోగులకు దీపావళి కానుకగా వరుస సెలవులను ప్రకటించాయి. ఉద్యోగులు సంస్థాగత వృద్ధి కోసం నిరంతరం లక్ష్యాలను నిర్దేశించుకుని, గడువులోగా పూర్తి చేయడానికి శ్రమిస్తుంటారు. ఇలా తరుచూ అలసిపోవడం వల్ల వారి ఉత్పాదకతపై ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్, ఢిల్లీకి చెందిన పీర్ సంస్థ ఎలైట్ మార్క్ తమ సిబ్బంది మానసిక ఆరోగ్యం కోసం కీలక నిర్ణయం తీసుకున్నాయి. అక్టోబర్ 18 నుంచి 26 వరకు తొమ్మిది రోజుల పాటు సెలవులను ప్రకటించాయి. నిత్యం కార్యాలయ పనుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగులకు విరామం ఎంతో అవసరమని, ఇలాంటి పండుగ సెలవులు వారికి ఎంతో దోహదం చేస్తాయని ఎంబసీ గ్రూప్ చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్ మారియా రాజేశ్ అన్నారు. దీపావళి సందర్భంగా సెలవులు ప్రకటిస్తున్నట్లు ఎలైట్ మార్క్ సీఈవో రజత్ గ్రోవర్ ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేశారు. ఈ సెలవుల్లో సంస్థాగత ఈ-మెయిళ్లకు దూరంగా ఉంటూ, కుటుంబంతో సంతోషంగా గడపాలని సూచించారు. సంస్థ ప్రకటించిన సెలవులపై ఒక ఉద్యోగి తన హర్షం వ్యక్తం చేస్తూ లింక్డిన్‌లో పోస్ట్ చేశారు. సిబ్బంది శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ముందుకెళుతున్న సంస్థలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సెలవులు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించి, నూతనోత్సాహంతో పనిపై దృష్టిపెట్టడానికి సహాయపడతాయని ఆయన అన్నారు. ఈ-కామర్స్ సంస్థ మీషో కూడా ఉద్యోగులకు వరుస సెలవులను ప్రకటించింది. మెగా బ్లాక్‌బస్టర్ సేల్స్ తర్వాత ఉద్యోగులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని, తమపై తాము దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. సెలవుల అనంతరం సరికొత్త శక్తితో తిరిగి వస్తామని మీషో తెలిపింది.

## వైట్ హౌస్‌కు నోబెల్ కమిటీ కౌంటర్

ఓస్లో: నోబెల్ శాంతి బహుమతిని ఈ ఏడాదికి వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోకు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ బహుమతిపై ఆశలు పెంచుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు నిరాశ తప్పలేదు. ఈ విషయంలో అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ ఓ అడుగు ముందుకు వేసి ట్రంప్ కు శాంతి బహుమతి వచ్చినట్లు 'మిస్టర్ పీస్ ప్రెసిడెంట్' అంటూ ప్రచారం కూడా చేసింది. తీరా నోబెల్ దక్కకపోవడంతో అక్కసు పెంచుకున్న వైట్ హౌస్.. నోబెల్ కమిటీపై విమర్శలు చేసింది. బహుమతి ప్రకటనను రాజకీయం చేశారని ఆరోపించింది. ఈ విమర్శలపై నోబెల్ కమిటీ తాజాగా స్పందించింది. "నోబెల్ అవార్డుల ఎంపికకు ముందు అన్నిరకాలుగా పరిశీలన జరుపుతాం. అవార్డు అందుకోవడానికి అన్ని అర్హతలు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే ఎంపిక చేస్తాం. నోబెల్ ప్రైజ్ కు ఎంపికలో ప్రధానంగా 'అభ్యర్థి చేసిన పనుల' ను పరిగణనలోకి తీసుకుని, ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామా ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తామని పరోక్షంగా వైట్ హౌస్ కు చురకలు వేసింది. నోబెల్ పీస్ ప్రైజ్ ఎంపికలోనూ ఈ నియమాలనే పాటించామని స్పష్టం చేసింది.




## రాహుల్‌కు పట్టిన గతే తేజస్వికీ

**తేజస్వి ఓటమి ఖాయమన్న ప్రశాంత్ కిశోర్**

పాట్నా: 2019లో కాంగ్రెస్ కంచుకోట అమేథీలో రాహుల్ గాంధీకి ఎదురైన పరాభవం లాంటిదే, రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు కూడా తప్పదని జన్ సూరజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) సంచలన వ్యాఖ్యలు చేశారు. తేజస్వీ ప్రాతినిధ్యం వహిస్తున్న రఘోపూర్ నియోజకవర్గంలోనే ఈ ఎన్నికల్లో ఆయన అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. పాట్నాలోని రఘోపూర్‌లో తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్‌కు 15 ఏళ్లుగా కంచుకోటగా ఉన్న అమేథీలో రాహుల్ గాంధీ, బీజేపీ నేత స్మృతి ఇరానీ చేతిలో అవమానకర రీతిలో ఓడిపోయారు. ఇప్పుడు ఆర్జేడీకి, తేజస్వీ యాదవ్‌కు కూడా అదే గతి పడుతుంది" అని స్పష్టం చేశారు. రఘోపూర్ నియోజకవర్గం దశాబ్దాలుగా లాలూ కుటుంబం ఆధిపత్యంలో ఉందని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. 1995, 2000లలో లాలూ ప్రసాద్ యాదవ్, 2005లో రబ్రీ దేవి, ఆ తర్వాత 2015, 2020లలో తేజస్వీ యాదవ్ ఇక్కడి నుంచే గెలిచారని గుర్తు చేశారు. ఇన్నేళ్లుగా ఒకే కుటుంబం పాలిస్తున్నా, ఈ ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆయన విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా వంశపారంపర్య పాలనకు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
శనివారం 11-10-2025 www.evarthalu.com




## బావమరిది పెళ్లిలో తారక్

ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ పెళ్లి హైదరాబాద్ శివార్లలోని శంకర్‌పల్లిలో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. లక్ష్మీ శివాని మెడలో నితిన్ మూడు ముళ్లు వేశారు. అయితే ఈ వేడుకలో ఎన్టీఆర్- ఆయన భార్య లక్ష్మీ ప్రణతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తారక్- లక్ష్మీ ప్రణతి స్వయంగా అతిథుల్ని ఆహ్వానించారు. ఈ పెళ్లికి సంబంధించి అనేక ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇందులో తారక్ క్రీమ్ అండ్ గోల్డ్ షేడింగ్ కుర్తాలో, గోల్డ్ కోటింగ్ శారీ ప్రణతి కనిపించారు. కొత్త వధూవరులను ఆశ్వీదించారు. నితిన్ శివాని ఇద్దరూ ఒకరికొకరు జీలకర బెల్లం తలపై పెట్టుకుంటుండగా.. తారక్, ప్రణతి కపుల్ కొత్త జంటను ఆశీర్వదించారు. ముఖ్యంగా తారక్ కు సోదరి వరస అయ్యే శివాని తలపై చేయి ఉంచడం అక్కడున్న వారందరినీ ఆకర్షించింది. ఈ ఫొటో సోషల్ మీడియలో వైరల్ అయ్యింది. ఇది పిక్ ఆఫ్ ది డే అంటూ తారక్ ఫ్యాన్స్ ట్రెండ్ చేస్తున్నారు. తారక్ - ప్రణతితోపాటు తమ చిన్న కుమారుడు అభయ్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాడు.

## లవ్లీ చిత్రం



## ఎంగేజ్‌మెంట్ రింగ్‌తో రష్మిక

టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ , రష్మిక మందన్నా ఎంగేజ్మెంట్ చేసుకున్నారని గత వారం రోజుల నుండి సోషల్ మీడియా,మెయిన్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్న సంగతి మనకు తెలిసిందే. అయితే ఈ జంట ఎంగేజ్మెంట్ చేసుకున్నట్టు ఇన్ని వార్తలు వినిపించినా కూడా ఇప్పటివరకు ఒక్క క్లారిటీ కూడా ఇవ్వకుండా అభిమానులని అయోమయంలోకి నెట్టేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ జంట ఎంగేజ్మెంట్ చేసుకున్నారనే దానికి ఇదే రుజువు అనేలా మరో విషయం కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్, రష్మిక ఇప్పటివరకు తమ ఎంగేజ్మెంట్ విషయాన్ని అధికారికంగా సోషల్ మీడియాలో ప్రకటించలేదు. కానీ ఇప్పుడు చేతి వేళ్లకు ఉన్న రింగ్స్ తో వీరి ఎంగేజ్మెంట్ కన్ఫామ్ చేసేసారు. అందులో భాగంగానే.. రీసెంట్ గా ఎంగేజ్మెంట్ రింగ్ తో విజయ్ కనిపించగా.. తాజాగా రష్మిక కూడా ఎంగేజ్మెంట్ రింగ్ తో దర్శనం ఇచ్చింది.





## రౌడీ బాయ్ కొత్త సినిమా లాంచ్

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ ఎంగేజ్మెంట్ ఇలా ముగిసిందో లేదో మళ్లీ ప్రొఫెషనల్ లైఫ్ లోకి వచ్చేశాడు. తన తదుపరి సినిమా ప్రారంభించేశాడు. ఎప్పట్నుంచో ప్రచారంలో ఉన్న రౌడీ జనార్ధన్ సినిమా ఇవాళ పూజా కార్యక్రమాలతో మొదలైంది. హైదరాబాద్ లో ఈ కొత్త సినిమా పనులు ప్రారంభం అయ్యాయి. దీనికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ముగిశాయి. రాజావారు రాణివారు ఫేమ్ డైరెక్టర్ రవికిరణ్ కోల తెరకెక్కిస్తున్నారు. కీర్తి సురేశ్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ ఇద్దరూ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఇదే తొలిసారి. శనివారం జరిగిన గ్రాండ్ లాంఛ్ ఈవెంట్ కు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హాజరయ్యారు. కాగా, ఈ సినిమా కోసం విజయ్- దిల్ రాజు మరోసారి కలిశారు. శ్రీ వేంకటేశ్వర బ్యానర్ పై ఈ చిత్రం రూపొందుతోంది.



## బన్నీకి కళ్లు చెదిరే రెమ్యునరేషన్!

దేశంలో టాలీవుడ్ సినిమాలకు ఫుల్ క్రేజ్ వస్తోంది. మార్కెట్ కూడా బాగానే ఉంటోంది. మన హీరోల రెమ్యూనరేషన్ కూడా అదే స్థాయిలో ఉంటోంది. ఇండియాలో మోస్ట్ కాస్ట్లీయెస్ట్ హీరోగా అల్లు అర్జున్ మారిపోతున్నాడట. బన్నీ, తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీతో పాన్ వరల్డ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాను హై విజువల్స్ వండర్స గా తెరకెక్కిస్తున్నరు. సుమారు రూ.800 కోట్ల భారీ బడ్జెట్ తో సన్ పిక్చర్స్ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్ ను రూపొందిస్తుంది. అయితే ఈ సినిమాకు బన్నీ భారీ మొత్తంలో తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కు ఆయన రూ.175 కోట్లు పారితోషికం అందుకుంటున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో కోడై కూస్తోంది.

## దోస్తానాలో ప్రతిభా రంతా



దోస్తానా2 కోసం మేకర్స్ కొత్త క్యాస్టింగ్ ను వెతుకుతున్న నేపథ్యంలో జాన్వీ కపూర్ ప్లేస్ లో లాపాటా లేడీస్ లో నటించిన ప్రతిభా రంతాను ఫైనల్ చేశారని తెలుస్తోంది. లక్ష్య ఈ ప్రాజెక్టులో కొనసాగుతున్నప్పటికీ కార్తీక్ ఆర్యన్, జాన్వీ కపూర్ మాత్రం దోస్తానా2 నుంచి తప్పుకున్నారు. కార్తీక్ ఆర్యన్ స్థానంలో విక్రాంత్ మాస్సేను తీసుకోగా, జాన్వీ ప్లేస్ లో ప్రతిభా రంతాను తీసుకున్నారని తెలుస్తోంది. ముందుగా ఈ పాత్ర కోసం శ్రీలీల పేరుని పరిశీలించినప్పటికీ ఆఖరికి ప్రతిభా రంతాను సెలెక్ట్ చేశారని తెలుస్తోంది. లాపాటా లేడీస్ లో తన యాక్టింగ్ తో అందరినీ ఆకట్టుకున్న ప్రతిభా రంతా దోస్తానా2 సినిమాకు కొత్త ఉత్సాహాన్ని తెస్తోందని అందరూ భావిస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నర్ విక్రాంత్ మాస్సే ఈ సినిమాలో తాను నటిస్తున్న విషయాన్ని రీసెంట్ గానే కన్ఫర్మ్ చేశారు. 12 ఫెయిల్, ఎ డెత్ ఇన్ ది గంజ్, హసీన్ దిల్‌రూబా సినిమాల్లో తన నటనకు విమర్శకుల ప్రశంసలు అందుకున్న విక్రాంత్ మాస్సే, దోస్తానా2 కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనున్నారు. ఇదిలా ఉంటే 2019లోనే ధర్మ ప్రొడక్షన్ లో లక్ష్య లాంచ్ కావాల్సింది. కానీ దోస్తానా2 సినిమా ఆగిపోవడంతో అది జరగలేదు. ఇప్పుడు దోస్తానా2 తిరిగి మొదలవుతున్న సందర్భంగా ఎంతో కాలంగా వెయిట్ చేస్తున్న లక్ష్య లాంచ్ కూడా జరిగే అవకాశముంది.




## దీపిక ప్లేస్‌లో ఆలియా

కల్కి 2 సినిమాలో దీపిక పడుకోణ్‌కు రీప్లేస్ మెంట్ ఎవరు అన్న ప్రశ్నకు తెరపడినట్లే తెలుస్తోంది. ముంబై మీడియా వర్గా డిస్కషన్స్ ను బట్టి అలియా భట్ కి కల్కి 2 ఆఫర్ వచ్చిందని అంటున్నారు. దీపికాకు కచ్చితంగా అలియా భట్ రీప్లేస్ మెంట్ ఆప్షన్ అవుతుంది. ఎందుకంటే దీపికా స్టార్ ఇమేజ్, అలియా స్టార్ ఇమేజ్ గురించి పక్కన పెడితే.. ఒక పాత్రకు దీపికా ఎలాగైతే తన బెస్ట్ ఇస్తుందో.. అలియా భట్ కూడా నెక్స్ట్ లెవెల్ యాక్టింగ్ చేస్తుంది. అలియా భట్ ఆల్రెడీ తెలుగులో ఆర్.ఆర్.ఆర్ కి చేసింది. తెలుగు ఆడియన్స్ ప్రేమను అలియా భట్ చాలా ఇష్టపడుతుంది. సో దీపికా ప్లేస్ లో అలియా భట్ ఎంపిక కచ్చితంగా బెటర్ అనిపిస్తుంది.

## తప్పు చేస్తున్న శ్రీలీల

శ్రీ లీల.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో యంగ్ హీరోయిన్ గా పేరు సొంతం చేసుకున్న ఈమె.. ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస అవకాశాలు అందుకుంటూ బిజీగా మారిపోయింది. వరుస అవకాశాలు అయితే వస్తున్నాయి కానీ సక్సెస్ రేట్ మాత్రం నిల్ అని చెప్పడంలో సందేహం లేదు. సాధారణంగా ఒకసారి దెబ్బతిన్న తర్వాత మరొకసారి కచ్చితంగా ఎవరైనా సరే కళ్ళు తెరుచుకుంటారు. కానీ శ్రీ లీలా మాత్రం మళ్లీ అదే తప్పు చేస్తూ అభిమానులను టెన్షన్లో పెట్టేసింది. ఒకప్పుడు కథలను సరిగ్గా ఎంచుకోక వరుసగా డిజాస్టర్లను మూటగట్టుకున్న శ్రీ లీల.. ఇప్పుడు మళ్లీ అదే దారిలోనే వరుసగా బ్యాక్ టు బ్యాక్ సినిమాలను ప్రకటిస్తోంది. కనీసం ఇప్పటికైనా మంచి సబ్జెక్టును ఎంచుకుందా.. లేక మొదట్లో లాగే వరుస ఆఫర్లను అందుకొని డిజాస్టర్లను మూటగట్టుకుంటుందా అనే విషయం తెలియాలి అంటే ఈ సినిమాలు తెరకెక్కే వరకు ఎదురు చూడాల్సిందే.





## ఇండియా హిస్టరీలో కొత్త అటెంప్ట్: అట్లీ

అల్లు అర్జున్‌తో చేయబోయే సినిమా గురించి లేటెస్ట్ గా అట్లీ క్రేజీ కామెంట్స్ చేశారు. ఇండియన్ సినిమాల్లోనే ఒక కొత్త అటెంప్ట్ గా ఇది వస్తుందని అన్నారు. సినిమా చాలా పెద్ద ప్లానింగ్ ఉందని చెప్పుకొచ్చారు. కచ్చితంగా ఆడియన్స్ కు ఒక మంచి విజువల్ ట్రీట్ అందించేలా ఇది ఉంటుందని అంటున్నారు. సో హిస్టరీలో రాసి పెట్టుకునే సినిమా తీసే ప్లానింగ్ తో అట్లీ ఉన్నాడనిపిస్తుంది. ఆడియన్స్ ఇస్తున్న ప్రేమను తాను తిరిగి ఇస్తున్నా అంటున్నాడు అట్లీ. రాజా రాణి తీసినప్పుడు తన పై ప్రేమ చూపించారు. ఆ తర్వాత తెరి, మెర్సల్, జవాన్ ఇలా ఆడియన్స్ ఇస్తున్న ప్రేమను తిరిగి వాళ్లకి ఇస్తున్నా అని.. మళ్లీ అల్లు అర్జున్ సినిమాతో ఈసారి ఆడియన్స్ కి విజువల్ ట్రీట్ అందిస్తానని అన్నారు.







# టీమిండియా పైచేయి

## 518/5 వద్ద భారత్ డిక్లేర్డ్.. చేజారిన యశస్వి డబుల్ సెంచరీ

### శతకం చెలరేగిన కెప్టెన్ గిల్.. బౌలింగ్‌లో జడేజా 3 వికెట్లు

వెస్టిండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో భారీ స్కోర్ చేసిన భారత్.. ఆ తర్వాత బౌలింగ్‌లో చెలరేగింది. రవీంద్ర జడేజా(3/98) తీన్మార్ బౌలింగ్‌తో రెండో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 43 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసింది.

ఆ జట్టు ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది. ఓపెనర్లు త్యాగనరైన్ చంద్రపాల్(67 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 34), జాన్ కాంప్‌బెల్(25 బంతుల్లో 2 ఫోర్లతో 10) మరోసారి నిరాశపర్చగా.. అలిక్ అథనాజే(84 బంతుల్లో 5 ఫోర్లతో 41), షైహోప్(46 బంతుల్లో 5 ఫోర్లతో 31 బ్యాటింగ్) పర్వాలేదనిపించారు. రోస్టన్ ఛేజ్ (0) డకౌటవ్వగా.. టెవిన్ ఇమ్లాచ్(14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. భారత బౌలర్లలో జడేజా మూడు వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 134.2 ఓవర్లలో 5 వికెట్లకు 518 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(258 బంతుల్లో 22 ఫోర్లతో 175), శుభ్‌మన్ గిల్(196 బంతుల్లో 2 సిక్స్‌లతో 16 ఫోర్లతో 129 నాటౌట్) శతకాలతో చెలరేగారు. నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 43), ధ్రువ్ జురెల్(79 బంతుల్లో 5 ఫోర్లతో 44), కేఎల్ రాహుల్(54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 38) హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. వెస్టిండీస్ బౌలర్లలో జొమెల్ వారికన్(3/98) మూడు వికెట్లు తీయగా.. రోస్టన్ ఛేజ్ ఓ వికెట్ పడగొట్టాడు. మూడో రోజు ఆట మ్యాచ్ గమనాన్ని నిర్దేశించనుంది. వెస్టిండీస్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకొని బ్యాటింగ్ చేస్తే.. మ్యాచ్ రసవత్తరంగా మారుతుంది. అలా కాకుండా పెవిలియన్ క్యూ కడితే భారత్ ఏకపక్ష విజయాన్నందుకోనుంది. రెండో రోజు ఆటలోనూ మూడు సెషన్లలో టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. 318/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే అనవసర పరుగుకు ప్రయత్నించి యశస్వి జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్‌తో సమన్వయ లోపం కారణంగా అతను డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 74 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన నితీష్ కుమార్ రెడ్డితో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో గిల్ 95 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో నితీష్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగి హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. క్రీజులోకి ధ్రువ్ జురెల్ రాగా.. మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడిన గిల్ తొలి సెషన్‌ను ముగించాడు. దాంతో టీమిండియా 427/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లోనూ సాధికారికంగా బ్యాటింగ్ చేసిన గిల్.. 177 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ధ్రువ్ జురెల్ కూడా అతనికి అండగా నిలిచాడు. హాఫ్ సెంచరీ ముంగిట రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో ధ్రువ్ జురెల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో ఐదో వికెట్‌కు నమోదైన 102 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ఇండియా తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

## జడేజా తీన్మార్

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్.. భారత పేసర్లను ఆచితూచి ఆడింది. దాంతో జడేజాను బరిలోకి దింపిన గిల్ ఆశించిన ఫలితాన్ని రాబట్టాడు. ఓపెనర్ కాంప్‌బెల్ కొట్టిన షాట్‌ను షార్ట్ లెగ్ ఫీల్డర్ సాయి సుదర్శన్ అద్భుతంగా అందుకున్నాడు. ఈ క్యాచ్ పట్టే క్రమంలో అతని చేతికి గాయమైంది. క్రీజులోకి వచ్చిన అథనజేతో కలిసి చంద్రపాల్ ఆచితూచి ఆడాడు. దాంతో 26/1 స్కోర్‌తో విండీస్ టీబ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో విండీస్ ద్వయం సాధికారికంగా బ్యాటింగ్ చేసింది. ఓపికగా ఆడిన ఈ జోడీ వీలుచిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. హాఫ్ సెంచరీ దిశగా సాగిన చంద్రపాల్‌ను జడేజా రాహుల్ సాయంతో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. షైహోప్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించిన అలిక్ అథనజే(41)ను కుల్దీప్ యాదవ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే రోస్టన్ ఛేజ్(0)ను జడేజా డకౌట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన ఇమ్లాచ్‌తో కలిసి షైహోప్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడి రెండో రోజు ఆటను ముగించాడు.





## నా అభిమానిపైనే చేయి వేస్తావా?

### సిబ్బందికి రోహిత్ మందలింపు

తనను చూసేందుకు వచ్చిన ఓ చిన్నారి అభిమానిని అడ్డుకున్న సెక్యూరిటీపై టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'నా అభిమానిపైనే చేయి వేస్తావా?' అని సెక్యూరిటీని మందలించాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ కోసం రోహిత్ శర్మ సన్నదమవుతున్న విషయం తెలిసిందే. ముంబైలోని శివాజీ పార్క్ స్టేడియంలో రోహిత్ కఠినంగా శిక్షణ పొందుతున్నాడు. రోహిత్ శర్మ ప్రాక్టీస్‌ను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో ఈ స్టేడియానికి వస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ రోహిత్ వైపు దూసుకొచ్చిన ఓ చిన్నారి అభిమానిని సెక్యూరిటీ అడ్డుకుంది. అభిమానుల పట్ల దురుసుగా ప్రవర్తించడాన్ని తప్పుబడుతూ సెక్యూరిటీని మందలించాడు.

## 2027 వరల్డ్ కప్ ఆడాలని ఉంది: జడేజా

త్వరలో ఆస్ట్రేలియాతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌కు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను ఎంపిక చేయలేదు. దీంతో అతడి వన్డే కెరీర్ ముగిసిందా? వచ్చే ప్రపంచ కప్‌నకు ఎంపిక చేయారా? అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వెస్టిండీస్‌తో రెండో టెస్టు ఆడుతున్న జడేజా తనను ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై స్పందించాడు. ఈ విషయం గురించి మేనేజ్‌మెంట్ ముందుగానే తనతో మాట్లాడిందన్న జడేజా.. ఒకవేళ అవకాశం వస్తే ప్రపంచ కప్‌లో ఆడాలని ఉందని తన మనసులోని మాటనుబయటపెట్టాడు.



## ఆ ఓటమిని మరవలేను: గంభీర్

టీమిండియా హెడ్ కోచ్‌గా సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఎదురైన సిరీస్ పరాజయాన్ని తాను మరిచిపోలేనని గౌతమ్ గంభీర్ తెలిపాడు. జీవితాంతం ఈ ఓటమి తనను వెంటాడుతుందని చెప్పాడు. ఈ పరాజయాన్ని మరిచిపోయే ప్రయత్నం కూడా చేయనని, తమ ఆటగాళ్లకు పదే పదే గుర్తు చేస్తానని కూడా చెప్పాడు. రాహుల్ ద్రవిడ్ అనంతరం టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆసియా కప్ 2025 టోర్నీల్లో టీమిండియాను విజేతగా నిలిపాడు. కానీ సుదీర్ఘ ఫార్మాట్‌లో మాత్రం గంభీర్ హెడ్ కోచ్‌గా ఘోర పరాజయాలను చవిచూసాడు. అతని పర్యవేక్షణలో టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయ్యింది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే సొంతగడ్డపై క్లీన్ స్వీప్ కావడం ఇదే తొలిసారి. ఈ పరాజయంతో టీమిండియా డబ్ల్యూటీసీ 2025 ఫైనల్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. తాజాగా ఈ పరాజయంపై స్పందించిన గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వెస్టిండీస్‌తో రెండో టెస్ట్ సందర్భంగా రెండో రోజు ఆట లంచ్ బ్రేక్‌లో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన గంభీర్.. డబ్ల్యూటీసీ ఛాంపియన్‌గా నిలవాలంటే విదేశాల్లో కూడా రాణించాలని చెప్పాడు.





## ఆనంద్‌పై కాస్పరోవ్ గెలుపు

మూడు రోజులపాటు సాగిన క్లచ్ చెస్ లెజెండ్స్ పోరు ముగిసింది. భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, రష్యా స్టార్ గ్యారీ కాస్పరోవ్ మధ్య హోరాహోరీగా సాగింది. అయితే, పాయింట్లపరంగా తొలి రెండు రోజులు కాస్పరోవ్‌కు చాలా దూరంగా ఉండిపోయిన ఆనంద్.. మూడో రోజు అద్భుతంగా పుంజుకున్నాడు. కానీ, చివరికి కాస్పరోవ్ విజేతగా నిలిచాడు. మొదటి రెండు రోజులు 8.5 – 3.5తో వెనకబడిన ఆనంద్.. ఆఖరి రోజున అద్భుత విజయాలు నమోదు చేశాడు. కాస్పరోవ్‌తో ర్యాపిడ్ 1 గేమ్‌ను ఆనంద్ డ్రా చేసుకున్నాడు. అయితే, రెండో ర్యాపిడ్ గేమ్‌లో కాస్పరోవ్‌దే విజయం. అయినా పట్టువిడవని ఆనంద్ వరుసగా రెండు బ్లిడ్జ్ గేమ్స్‌లోనూ హవా చూపించాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
ఆదివారం 12-10-2025 | www.evarthalu.com

ఇప్పుడిప్పుడే బీసీల్లో చైతన్యం వస్తోందని ఆశపడ్డారు..
బీసీ నాయకులు ఎదుగుతారని సంతోషపడ్డారు..
బీసీ రాజ్యాధికారం కోసం కలబడ్డారు..
బీసీ జెండా ఎత్తుకొని నిలబడ్డారు..
భవిష్యత్తు బీసీలదేనన్నారు..
బీసీ వర్గాలు బాగుపడతాయన్నారు..
కానీ, ఒకే ఒక్క మాట...
అంతా రివర్స్. గొప్పదేదో జరిగిపోతోందని బీసీలు ఊహల్లో తేలియాడె. ఇంకేదో జరిగే సరికి తడబడె. బట్టబయలైన బీసీల అనైక్యత..
ఇక ఇంతే బ్యాక్ వర్డ్ క్లాసెస్ కథ...





# నోటి కాడి బుక్క.. కుక్కకు బొక్క!





శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్
9581291919

శ్రావణ వాణి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటనకు ముందు ఒక లెక్క.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటన తర్వాత ఒక లెక్క.. అన్నట్లు తయారైంది బీసీ నాయకుల పోరాటం. అంతకు ముందు అంతా బాగానే ఉండేది. బీసీల లక్ష్యం.. రాజ్యాధికారమే అన్నట్లుగా ఉద్యమం సాగింది. వచ్చే ఏ ఎన్నికైనా సరే.. గెలుపు బీసీలదే అన్నట్లుగా గాలిమేడలు కనిపించాయి. బీసీ ప్రజల్లో వచ్చిన చైతన్యం చూసి మేధావులు సైతం ఆనంద పడ్డారు. ఇది బీసీల అభ్యున్నతికి దోహదం చేస్తుందని అబ్బురపడ్డారు. కానీ, అది గాలిలో తేలిపోయే ఆవిరేనని అర్థం కావడానికి ఎంతో సమయం పట్టలేదు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తాం' అని ప్రకటించగానే బీసీలంతా కలిసి కాడి ఎత్తేశారు. అగ్రవర్ణ నాయకులు ప్రయోగించిన అస్త్రంలో అంతా బందీలైపోయారు. రాజ్యాధికారం అనే మాటే మరచిపోయారు. రిజర్వేషన్ చాలు అన్నట్లు మిడిసిపోయారు. రిజర్వేషన్ ప్రకటించిన రెడ్డి నాయకుడికి గౌడ్ పేరు తగిలించి అహో.. ఓహో.. అని ఆకాశానికి ఎత్తేశారు. అసలు విషయం బోధపడి బొందలగడ్డకు చేరారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్' ప్రకటన వెనుక ఎంత పెద్ద కుట్ర ఉందో అర్థం చేసుకోవడానికి బీసీ నాయకులకు చాలా సమయం పడుతోంది. కొంతమంది నాయకులైతే ఆ మత్తులోంచి బయటికి రాలేక కొట్టుమిట్టాడుతున్నారు. రాజ్యాధికారం అనే లక్ష్యాన్ని రిజర్వేషన్‌కు మాత్రమే పరిమితం చేసిందన్న సత్యాన్ని గ్రహించలేకపోతున్నారు. రాజ్యాధికారం అంటే బీసీలది పెత్తనం అవుతుంది. ఆ పెత్తనాన్ని బీసీల చేతిలో పెట్టడానికి అగ్రవర్ణ పెద్దలు సిద్ధంగా లేరు. అందుకే, కుక్కకు బొక్క వేసినట్లు.. 42 శాతం రిజర్వేషన్ అని ప్రకటించారు. ఆ బొక్కకే మటన్ ముక్కలన్నీ తనకే వచ్చినట్లు బీసీ నాయకులు ఫీలైపోయారు. క్షీరాభిషేకాలు చేశారు, కటౌట్లు పెట్టి నినాదాలు చేశారు. తీరా హైకోర్టు కండ్లు తెరిపించేసరికి, కోర్టే.. 'నోటి కాడి బుక్క'ను లాగేసిందని ఆరోపణలు మొదలుపెట్టారు. బీసీ నాయకుల ఆలోచనలు ఏ స్థాయికి దిగజారాయంటే.. హైకోర్టు ఎదుట నిరసనలు, ధర్నాలు చేసే అంత. ఇంతకుమించి బీసీ నాయకుల తెలివిని గొప్పగా అనుకోవడానికేం లేదని అర్థమైంది. బంద్‌లు పెడితే బీసీలు బాగుపడిపోతారా? అయ్యయ్యో బీసీలకు న్యాయం చేద్దామని హైకోర్టు తీర్పునేమైనా తిరిగి రాస్తుందా?

అసెంబ్లీ బిల్లులతో, సర్కారు జీవోలతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేస్తుందా? అన్న ప్రశ్నకు సమాధానాన్ని కూడా వెతకలేని దుస్థితి బీసీ నాయకులది, బీసీ ప్రజలదీ. రాజకీయ పార్టీలు ఎన్నో హామీలు ఇస్తాయి.. ప్రజల మెప్పు కోసం పడరాని పాట్లు పడతాయి. అందులో రిజర్వేషన్ ప్రకటన ఒకటి. కానీ, ఆ ప్రకటన అమలు కావడానికి ఆస్కారం ఉందా? అమలు కాకపోతే అడ్డుగా ఉన్న సాంకేతిక అంశాలు ఏంటి? అనే ప్రశ్నలకు జవాబులు వెతకాల్సింది బీసీ నాయకులే కదా.


రిజర్వేషన్ పెంపు సాంకేతికంగా సాధ్యం కాదని కొంతమంది మేధావులు మొదట్నుంచీ చెప్తూనే ఉన్నారు. కానీ, ఆ మేధావులను పిచ్చోళ్లుగా ముద్రవేశారు కొందరు బీసీ నాయకులు. రాస్తారోకోలు, ధర్నాలు, డిమాండ్లు చేసేకంటే ముందు రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, తెలంగాణ (వీ) ప్రకాశ్ లాంటి మేధావులతో చర్చలు జరిపి.. లాభనష్టాలు బేరీజు వేసుకొని ముందుకు వెళ్లాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ సామాజిక న్యాయ కార్యాచరణ సిద్ధం చేయాలి. కానీ, తామే నాయకులం.. తాము చెప్పిందే రైట్.. తాము చేసేదే కరెక్ట్ అన్నట్లు ప్రవర్తిస్తే జోకర్లుగా మారక తప్పదు. రాజకీయ పార్టీలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. రిజర్వేషన్ పెంచుతామని నమ్మించినా.. సాంకేతికంగా సాధ్యం కానేకాదు. మహారాష్ట్ర (2021), బీహార్ (2024) జీవోల రద్దు తీర్పులు మనకు అవగాహన కలిగిస్తున్నాయి. గతంలో కొందరు బీసీ నాయకులు అగ్రవర్ణ రాజకీయ పార్టీల నాయకులు విసిరేసే బొక్కలకు, ముక్కలకు, మందు చుక్కలకు ఆశపడి సాగిలపడ్డారు. కానీ, ఇప్పుడా పరిస్థితి లేదు. గల్లా పట్టి నిలదీసే వ్యవస్థ తయారైంది. కాబట్టి.. 'రిజర్వేషన్' అని కాకుండా 'రాజ్యాధికారం' లక్ష్యంగా అడుగులు వేస్తేనే బీసీలకు భవిష్యత్తు. బీసీ నాయకులకు అధికార సీటు. రాజ్యాధికారం సాధనే ముఖ్యం అనే అవగాహనతో, ప్రజలను చైతన్యం చేయడానికి, ఆ దిశలో జరిగే చైతన్య కార్యక్రమాల్లో జనాల్ని భాగస్వాములను చేసేలా బీసీ నాయకులు సమాయత్తం కావాలి. రాజకీయ, సామాజిక వేదికలపై బీసీలకు రాజ్యాధికారం ఎంత అవసరం? అన్నది వివరించాలి.

## బీసీలకు ఏం కావాలి?
బీసీ నాయకులకు ఏం కావాలి?
బీసీలు ఏం కోరుకుంటున్నారు?
బీసీ నాయకులు ఏం తేవాలనుకుంటున్నారు?
ఏది కావాలి? రాజ్యాధికారమా? రిజర్వేషనా?
రాజ్యాధికారం కోసం పోరాటమా?
కేవలం రిజర్వేషన్ కోసం ఆరాటమా?
రాజ్యాధికారం వస్తే రిజర్వేషన్ రాదా?
రిజర్వేషన్ వస్తే రాజ్యాధికారం వచ్చినట్లేనా?
ఆ మాత్రం క్లారిటీ లేని బీసీ నాయకులు..
నిరసనలు, ధర్నాలతో కాలయాపనలు..
అగ్రవర్ణ కుట్రల్లో బందీలుగా మారిపోయారు
బీసీ నాయకులే బీసీలకు ద్రోహం చేస్తున్నారు

## రిజర్వేషన్ డ్రామా ఇదీ..

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం – రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దు

తెలంగాణ సర్కారు జీవోలో – రిజర్వేషన్లు 67 శాతానికి చేరాయి. అందులో బీసీలకు 42 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయింపు జరిగింది. అంటే.. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను దాటి జీవో విడుదలైంది. అందుకే కోర్టు కొట్టేసింది. ప్రభుత్వం నవ్వుల పాలైంది. బీసీలు భ్రమల్లోంచి బయటికి వచ్చారు. తమకు వేసింది బొక్క.. అంతా బొక్కే అని అర్థం చేసుకున్నారు.



## తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ ఇలా..

తమిళనాడులో రిజర్వేషన్లు 69 శాతం అమలవుతున్నాయి. మరి అక్కడెలా సాధ్యమైంది? అంటే.. సుదీర్ఘమైన చరిత్ర ఉంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మద్రాస్ రాష్ట్రంలో రిజర్వేషన్లు క్రమక్రమంగా పెరుగుతూ వచ్చాయి. 1971లో డీఎంకే ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 31 శాతానికి పెంచింది.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 16 నుంచి 18 శాతానికి పెంచింది. దీంతో రిజర్వేషన్లు 49 శాతానికి చేరాయి. ఆ తర్వాత 1980ల్లో ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 31 శాతం నుంచి 50 శాతానికి పెంచింది. బీసీ, ఎస్సీ, ఎస్టీల మొత్తం రిజర్వేషన్ల శాతం 68 శాతానికి చేరాయి. ఆ తర్వాత 1989లో డీఎంకే ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేకంగా మరో 1 శాతం రిజర్వేషన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇలా తమిళనాడులో రిజర్వేషన్ శాతం 69 శాతానికి చేరింది. అయితే, 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు)లో సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో తప్ప దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని తీర్పులో పేర్కొంది. ఇది తమిళనాడులో అప్పటికే అమలు అవుతున్న 69 శాతం రిజర్వేషన్లకు అడ్డంకిగా మారింది. అయితే, 69 శాతం రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేసేందుకు ఆ రాష్ట్ర సీఎం జయలలిత చాకచక్యంగా వ్యవహరించారు. 1994 తమిళనాడు శాసన సభలో చట్టం – 45ను ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా రాష్ట్రంలోని విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది ప్రధాన లక్ష్యం. రాజ్యాంగ సవరణను చేయించడానికి అప్పటి సీఎం జయలలిత, కేంద్రంలో పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చారు. అప్పటికి తమిళనాడులో కాంగ్రెస్–ఏఐఏడీఎంకే కూటమి పొత్తుతో ఉంది. దాంతో రాజ్యాంగ సవరణకు అప్పటి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వక తప్పలేదు. రాజకీయ అనివార్యత కారణంగానే 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చారు. ఈ షెడ్యూల్‌లో చేరిన చట్టాలపై న్యాయస్థానాలు సమీక్షించలేవు. ఇలా తమిళనాడు రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కలిగింది. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి దాటకూడదని సుప్రీం తీర్పు ఇచ్చినా, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి.

OWNED, PUBLISHED BY BOMMAKANTI SHRAVAN KUMAR, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: BOMMAKANTI SHRAVAN KUMAR, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.